# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 93 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 24 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 93 24-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




ప్రకాశం జిల్లాలో
## ఘోర రోడ్డు ప్రమాదం..
ఆరుగురు దుర్మరణం

- మిగతా 3 లో..

### రక్షణ పరిశోధన , అభివృద్ధి సంస్థలను
# ఏపీలో ఏర్పాటు చేయండి..
### రాజ్‌నాథ్‌ను కోరిన చంద్రబాబు



- రూఫ్ టాప్ ఫ్రీ సోలార్?
- ఎస్సీ, ఎస్టీలకు ?20 లక్షల బెనిఫిట్స్ ?
- హరిత ఇంధనాన్ని మరింత చేరువచేయడమే లక్ష్యం
- యువతకు ఉద్యోగ కల్పనలో మరింత ప్రోత్సాహం
- కేంద్రమంత్రితో భేటీలో సీఎం చంద్రబాబు
- ఢిల్లీలో కొనసాగుతున్న ఏపీ సీఎం పర్యటన


న్యూఢిల్లీ మే23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌ను భారత రక్షణ, ఏరోస్పేస్ రంగాల భవిష్యత్తుకు ఒక మూలస్తంభంగా తీర్చిదిద్దే ప్రణాళికలలో భాగంగా థీమాటిక్ డిఫెన్స్ హబ్‌లు, డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన మరియు

- తరువాయి 2లో..







### ఏపీలో మళ్లీ కరోనా
# కలకలం..
### మరో పాజిటివ్ కేసు నమోదు

- కడప జిల్లాలో కొత్త కరోనా కేసు
- 75 ఏళ్ల వృద్ధురాలికి కరోనా పాజిటివ్
- నిన్న విశాఖలో యువతికి కరోనా పాజిటివ్
- ప్రజలను అప్రమత్తం చేసిన వైద్య, ఆరోగ్య శాఖ

అమరావతి మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. తాజాగా కడప జిల్లాలో ఓ వృద్ధురాలికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై, ప్రజలకు కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు తీవ్ర జ్వరంతో బాధపడుతూ కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చేరారు. అక్కడ వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో ఆమెకు కరోనా సోకినట్లు నిర్ధారించారు. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.
వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా కేసులు క్రమంగా


- తరువాయి 2లో..

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్
### నలుగురు మావోయిస్టుల మృతి

2 లో



# ఒక్క రోజులో రికార్డు స్థాయిలో శ్రీవారి దర్శనం
### కొనసాగుతోన్న భక్తుల రద్దీ..!



తిరుమల మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**తిరుమలలో వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా శ్రీవారిని త్వరత్వరగా దర్శనం చేసుకుంటున్నారు. ఇది అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని అదనపు ఈవో చెప్పారు. గురువారం రోజున రికార్డు స్థాయిలో శ్రీవారి భక్తులకు దర్శనం అయిందని పేర్కొన్నారు.**

వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో గత వారం రోజులుగా భక్తుల తాకిడి పెరిగింది. సాధారణంగా గురువారం ఉదయం తిరుప్పావడ సేవ,
సాయంత్రం పూలంగి సేవ ఉన్న కారణంగా భక్తులకు

- తరువాయి 2లో..

### పుంగనూరు నియోజకవర్గంను
### అన్నమయ్యలోకి కలుపుతూ..
# నోటిఫికేషన్

చిత్తూరు మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: మెరుగైన పరిపాలన, అభివృద్ధి దృష్ట్యా, ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని పలమనేరు రెవెన్యూ డివిజన్ నుండి పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదం మండలాల మండలాలను, చిత్తూరు జిల్లాలోని చిత్తూరు రెవెన్యూ డివిజన్ నుండి రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను మదనపల్లె రెవెన్యూ డివిజన్ కింద ఉన్న అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలలో నివసిస్తున్న వారి నుండి అభ్యంతరాలు లేదా సూచనలను ఆహ్వానించారు. వీటిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని

- తరువాయి 2లో..






### కాంగ్రెస్ పాలనలో..
# మహిళలకే పెద్దపీట
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
### రూ. 494 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

మెదక్ మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సంగారెడ్డి జిల్లాలో ప్రజాపాలన ప్రగతి బాట కింద శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 494.67 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత కేంద్రీయ విద్యాలయం అనంతరం పస్తాపూర్ సభాస్థలి వద్ద జహీరాబాద్ నియోజకవర్గంలో

మిగతా 2లో

# కొడాలి నానికి షాక్
### లుకౌట్ నోటీసులు జారీ

విజయవాడ మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నాని ఊహించని షాక్ తగిలింది. మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానిపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దేశంలో అన్ని విమానాశ్రయాలకు, పోర్టులకు ఈ సర్క్యులర్‌ను పోలీసులు పంపారు. కొడాలి నానిపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఆయన ముంబైలో గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనంతరం అమెరికా వెళ్తారని ప్రచారం



- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## విపక్షరాష్ట్రాల్లో ఇడి దూకుడు

సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై మరోసారి సుప్రీం కోర్టు ఆగ్రహించడం తాజాగా చర్చనీయాంశమైంది. గత ఏడాది మే నెలలో ఇడి దర్యాప్తు తీరుపై ఎన్నో ఫిర్యాదులు రావడంతో సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించింది. దర్యాప్తుల సమయంలో భయోత్పాత వాతావరణం సృష్టించవద్దని హెచ్చరించింది. అయినాసరే ఇడి వ్యవహారంలో మార్పు రాలేదన్న విమర్శలు వస్తున్నాయి. చాలా కేసుల దర్యాప్తులో ఇడి తనకున్న అసాధారణ అధికారాలతో దూకుడుగా వ్యవహరిస్తోందని గత కొన్ని సంఘటనల బట్టి తెలుస్తోంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వం నిర్వహించే మద్యం రిటైలర్ టాస్మాక్‌లో రూ. 1000 కోట్ల మేర అవకతవకలు జరిగాయని ఈ ఏడాది మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలు జరిపింది. ఇటీవల మళ్లీ మేనెల ఆరంభంలో టాస్మాక్ అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. ఈ అవకతవకలపై రాష్ట్రపోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఇడి మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఇడి సోదాలు చేస్తోందని, టాస్మాక్ అధికారులను హింసిస్తోందని తమిళనాడు ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో తాజాగా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఇడి తీరును తప్పుపట్టింది. సోదాల పేరుతో హద్దులు దాటుతున్నారని ఆగ్రహించింది. కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వరకు చెందిన విద్యాసంస్థల్లో కూడా బుధవారం (మే 21) ఇడి సోదాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఈ విద్యాసంస్థలు గత కొన్నేళ్లుగా పేరుపొందినవే. కర్ణాటక ప్రభుత్వం తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతుండడంతో బిజెపి కన్నెర్రనౌతోందని అందుకే దర్యాప్తు సంస్థలతో భయపెడుతోందని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లడానికి ప్రయత్నిస్తోందని కర్ణాటక కాంగ్రెస్ తీవ్రంగా విమర్శిస్తోంది.

కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో కర్ణాటక హోం మంత్రి విద్యాసంస్థలకు, రన్యారావుకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. ఈ దాడులు వెనుక కేంద్రంలోని అధికార బిజెపి ప్రేరణ ఉందని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది రూ. 2000 కోట్ల మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులో అప్పటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్‌ను ఇరికించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రయత్నిస్తోందని, దీనికోసం తమ రాష్ట్రంలో భయానక పరిస్థితి కల్పిస్తోందంటూ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విధి నిర్వహణలో భాగంగా అవతలివారిని బెదిరించి భయపెట్టడం మంచిది కాదని సుప్రీం కోర్టు ఇడిని మందలించింది. మనీలాండరింగ్ చట్టం లోని కొన్ని నిబంధనలను కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేసి భయపెట్టడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కూడా చత్తీస్‌గఢ్ ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చింది. ఆనాడు చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం సాగడం రాజకీయంగా అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికే అన్న అపవాదు కూడా వచ్చింది. కర్ణాటకలో వాల్మీకి ఎస్‌టి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుక్కునేలా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేరును తెరపైకి తీసుకురావడానికి కూడా ఇడి పావులు కదిపినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు ఇడి అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కర్ణాటక రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ కల్లేష్ బి ఫిర్యాదు చేయడంతో ఇడి అధికారులు ఇద్దరిపై కర్ణాటకలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అయితే కర్ణాటక హైకోర్టు దీనిపై స్టే విధించడంతో ఈ వ్యవహారానికి బ్రేకు పడింది. నగదు అక్రమ చలామణీ జరిగిందని ఇడి పెడుతున్న కేసుల్లో చాలావరకు శిక్షలు పడడం తక్కువే అని సుప్రీం కోర్టు కూడా గతంలో వ్యాఖ్యానించింది. పక్కాగా సాక్షాధారాలు సేకరించడంలో ఇడి వైఫల్యాన్ని సుప్రీం ఎత్తి చూపింది. 2014 2024 మధ్య కాలంలో నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద 5297 కేసులు పెట్టగా, వాటిలో 40 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని కేంద్ర హోంశాఖ గత ఏడాది వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం రిటైలర్ టాస్మాక్‌పై సోదాలు కూడా దూకుడుగా హద్దులు దాటుతుండడమే అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడం ఇడి విశ్వసనీయతకు తీరని కళంకం. టాస్మాక్‌పై జరుగుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తుపై సుప్రీం స్టే విధించడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశం. తమిళనాడు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బిజెపి కుట్రల్లో ఇదో భాగంగా తమిళనాడు ప్రభుత్వం విమర్శిస్తోంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల దాడులు విచక్షణా రహితంగా సాగుతున్నాయన్న అపవాదు చాలా కాలంగా వినిపిస్తోంది. కేంద్రం కనుసన్నల్లోనే ఇవి పనిచేస్తున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా ఉన్న విపక్ష పాలిత రాష్ట్రాల పైనే ఈ దాడులు టార్గెట్ చేసుకుంటున్నాయి. ఆయా వర్గాల ఆస్తులు జప్తు అవుతన్నాయి. ఇడి జప్తు చేసిన ఆస్తుల పరిస్థితి పరిశీలిస్తే యుపిఎ ప్రభుత్వ హయాంలో 200405 నుంచి 201314 వరకు కేవలం రూ. 5346 కోట్ల ఆస్తులే జప్తు కాగా, మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత 2014 నుంచి 2022 వరకు రూ. 99,356 కోట్ల విలువైన ఆస్తులు జప్తు అయ్యాయి. అలాగే ఇడి కేసుల్లో 95% ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో నమోదైనవే.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

## నలుగురు మావోయిస్టుల మృతి

**వరంగల్ మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కవండే సమీపంలో మహారాష్ట్ర %-% ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు ఉన్నట్లు అందిన విశ్వసనీయ నిఘా ఆధారంగా, అదనపు ఎస్పీ రమేష్ మరియు 12 సీ60 పార్టీలు (300 కమాండోలు), సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలోని ఒక ఆపరేషన్ గురువారం నుంచి ప్రారంభించారు. కవాండే , నెల్గుండ నుండి ఇంద్రావతి ఒడ్డు వైపు భారీ వర్షం కురుస్తున్న సమయంలో సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయం కార్డన్ వేసి నది ఒడ్డున సోదాలు చేస్తుండగా, మావోయిస్టులు సీ60 కమాండోలపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం ప్రారంభించారు, దీంతో పోలీసులు ఎదురుకాల్పులు ప్రారంభించారు. దాదాపు రెండు గంటల పాటు అడపాదడపా కాల్పులు కొనసాగాయి. ఈ ప్రాంతంలో పోలీసుల జరిపిన సోదాల్లో నలుగురు మావోయిస్టుల మృతదేహాలు, ఒక ఆటోమేటిక్ సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, రెండు .303 రైఫిల్ మరియు ఒక భార్మర్ ను స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు, వాకీ టాకీలు, క్యాంపింగ్ సామగ్రి, నక్సల్ సాహిత్యం మొదలైనవి సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# తిరుమలలో 24న ‘డయల్ యువర్ ఈవో’

- **ఉదయం 9 నుండి 10 గంటల వరకు కార్యక్రమం**
- **భక్తులు నేరుగా ఈవోతో ఫోన్‌లో మాట్లాడే అవకాశం**
- **సూచనలు, సలహాలు కోసం ఫోన్ నంబర్: 0877-2263261**

**తిరుమల, మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తిరుమల – తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తులతో నేరుగా మాట్లాడేందుకు మరోమారు వేదికను సిద్ధం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు తమ అభిప్రాయాలను, సలహాలను, సమస్యలను నేరుగా టీటీడీ కార్యనిర్వహణాధికారి (ఈవో) దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ‘డయల్ యువర్ ఈవో’ కార్యక్రమం ఈ నెల



24 న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో నిర్వహిస్తారు. టీటీడీ ఈవో జె. శ్యామలరావు ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, భక్తుల నుండి ఫోన్ ద్వారా అందే సూచనలను, అభిప్రాయాలను స్వీకరిస్తారు. టీటీడీ సేవలు, యాత్రికుల సౌకర్యాలు, ఇతర నిర్వహణాపరమైన అంశాలపై భక్తులు తమ అమూల్యమైన సలహాలను ఈవోకు నేరుగా తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు 0877-2263261 అనే టెలిఫోన్ నంబర్‌కు డయల్ చేసి తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. ఈ ‘డయల్ యువర్ ఈవో’ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

## రక్షణ పరిశోధన , అభివృద్ధి సంస్థలను

## ఏపీలో ఏర్పాటు చేయండి..

అభివృద్ధి సంస్థ) అనుబంధ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఉత్కృష్టతా కేంద్రాలు) కేంద్రాలను ఎపిలో ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ ను ఎపి సిఎం చంద్రబాబు కోరారు.. భారతదేశాన్ని రక్షణ రంగంలో స్వావలంబన దిశగా నడిపించే ‘ఆత్మనిర్భర్ భారత్’ లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన వివరించారు.. ఈ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో పలు డిఫెన్స్ సంస్థలు ఏర్పాటు చేయాలని, అందుకు తమ ప్రభుత్వం అని విధాల సహకరిస్తుందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు నేడు రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో రాజ్ నాథ్ ను కలసి వివిధ ప్రతిపాదనలను అందజేశారు%ా% ఈ భేటీలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ముఖ్యంగా రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన సమగ్ర ప్రణాళికపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశం అద్భుతంగా, ఫలవంతంగా సాగిందని తెలిపారు ఇక రాష్ట్రంలో వ్యూహాత్మక మౌలిక సదుపాయాల కల్పన, విధానపరమైన నూతన ఆవిష్కరణల ద్వారా రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించారని, రాష్ట్ర అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి ప్రోత్సాహకరమైన స్పందన, మద్దతు పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఎంతగానో దోహదపడుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

**బీసీలకు సబ్సిడీ కింద అందజేత..**

2025 జనవరిలో మంత్రిత్వ శాఖకు ఏపీ డిస్కంలు సమర్పించిన ప్రతిపాదనకు త్వరితగతిన ఆమోదం తెలపాలని సీఎం కేంద్రాన్ని కోరారు. ఈ ప్రతిపాదన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు లభిస్తాయి. అలాగే, బీసీ గృహాలకు కిలోవాట్‌కు ?10,000 చొప్పున 2 కిలోవాట్ల వరకు అమర్చుకునేలా సబ్సిడీ అందుబాటులో ఉంటుంది.

**ఉద్యోగ కల్పనలో ప్రోత్సాహం..**

రాష్ట్ర క్లీన్ ఎనర్జీ పాలసీ 2024-29లో భాగంగా అదనంగా 72.6 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని, ఇందులో 40 గిగావాట్ల సౌరశక్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది సామాన్యులకు సౌరశక్తిని అందుబాటులోకి తీసుకువస్తుంది. ప్రతిపాదిత యుటిలిటీ-నేతృత్వంలోని రూఫ్‌టాప్ మోడల్ ఏపీ విద్యుత్ కొనుగోలు వ్యయాలను తగ్గించడంతో పాటు, బలహీన వర్గాలకు సాధికారత కల్పిస్తుంది. ఉద్యోగ కల్పనను ప్రోత్సహిస్తుంది. కేంద్రం సహకరిస్తే, ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన వినియోగంలో దేశానికి మునుముందు మార్గనిర్దేశం చేయగలదని.. ఒక బెంచ్‌మార్క్‌ను నెలకొల్పుతుందని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## ఏపీలో మళ్లీ కరోనా

## కలకలం..

పెరుగుతున్నాయని వస్తున్న నివేదికల నేపథ్యంలో, ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, వేడుకలు, పార్టీలు, ఇతర సామూహిక కార్యక్రమాలను వీలైనంతవరకు వాయిదా వేసుకోవడం మంచిదని సూచించింది. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రజలు తప్పనిసరిగా కొవిడ్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా జనం ఎక్కువగా ఉండే చోట మాస్కులు ధరించడం తప్పనిసరి అని పేర్కొంది. జ్వరం, చలి, దగ్గు, తీవ్రమైన అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన తెలియకపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ముక్కు కారడం లేదా దిబ్బడ వేయడం, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటలూ పనిచేసే ల్యాబ్‌లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన టెస్టింగ్ కిట్లు, మాస్కులు, పీపీఈ కిట్లు, ట్రిపుల్ లేయర్ మాస్కులను తగినంత నిల్వ ఉంచుకోవాలని వైద్య అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి ప్రజలందరూ సహకరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, ప్రభుత్వ సూచనలను తప్పక పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ కోరింది.

## ఒక్క రోజులో రికార్డు స్థాయిలో

## శ్రీవారి దర్శనం

దర్శన సాధారణంగా రెండు మూడు గంటలు పైగా తగ్గుతుంది. అందుకనే గురువారం రోజున సాధారణంగా కేవలం 62 నుంచి 63 వేల మంది భక్తులు మాత్రమే శ్రీవారిని దర్శించుకునే వీలు ఉంటుంది. అయితే అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి నేతృత్వంలో తిరుమలలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు సమన్వయపరుస్తూ.. అదనంగా దాదాపు పదివేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకునే వీలుని కల్పించారు. శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. దీంతో తొలిసారి గురువారం రోజున 72,579 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ నేపధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విశేష కృషి చేసిన అన్ని విభాగాల సిబ్బందిని అదనపు ఈవో అభినందించారు. మరోవైపు భక్తులు దర్శనం కోసం వేచి ఉండే క్యూ లైన్లలో ఈవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

## పుంగనూరు నియోజకవర్గంను

## అన్నమయ్యలోకి కలుపుతూ..

## నోటిఫికేషన్

తెలిపారు. అన్ని అభ్యంతరాలు లేదా సూచనలు ఇంగ్లీషు లేదా తెలుగులో లిఖితపూర్వకంగా ఉండాలన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై రోజుల గడువు ముగిసేలోపు లేదా అంతకు ముందుగా చిత్తూరు జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకునేలా పంపాలని కోరారు.

## కాంగ్రెస్ పాలనలో..

## మహిళలకే పెద్దపీట

రూ.100 కోట్లతో నిర్మించిన 9 కిలో మీటర్ల గ్రీన్ కారిడార్ నిమ్జ్ రోడ్డు, రూ.100 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు. చిరాగ్‌పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం( గుమ్మడిదల) ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పస్తాపూర్ సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్ లను సందర్శించిన మహిళా సంఘాలతో ముచ్చటించారు. అనంతరం రూ.2 కోట్ల తో 3 షిఫ్ట్ ల వారిగా మహిళా సహకార సంఘాలు నిర్వహించబోయే ఇండియన్ ఆయిల్ ఔట్ లెట్ ను ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు పెద్ద పీట వేస్తుందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా మద్దతుగా, వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. కుటుంబానికి మహిళే వెన్నుముక అని మహిళ రాణిస్తే కుటుంబం మొత్తం రాణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షట్కర్, టీ జీ ఐఐ సీ ఛైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎంపీ కాంటెస్టేడ్ క్యాండిడేట్ నీలం మధు, నిమ్జ్ అధికారులు, మేఫ్మా అధికారులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొడాలి నానికి షాక్..

## లుకౌట్ నోటీసులు జారీ

జరిగింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ ద్వారా పోలీస్ అధికారులు కొడాలి నానిపై ఎల్‌వోసీ జారీ చేశారు.ఇది ఇలా ఉండగా%ా%. ఇటీవల కొడాలి నాని కి ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే. మొదటి హైదరాబాదులో జాయిన్ అయిన కొడాలి నాని ఆ తర్వాత ముంబైకి వెళ్లిపోయారు. అక్కడ గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకున్న తర్వాత%ా% ఏపీకి రాకుండా విదేశాలకు వెళ్ళినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వల్లభనేని వంశీ జైల్లో ఉన్నాడు. నెక్స్ట్ కొడాలి నానిని అరెస్టు చేస్తారని ముందు జాగ్రత్తగా విదేశాలకు వెళ్లారని చెబుతున్నారు.

### ప్రకాశం జిల్లాలో

# ఘోర రోడ్డు ప్రమాదం..

## ఆరుగురు దుర్మరణం



అమరావతి మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎపిలోని ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద లారీని, కారు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన కుటుంబం విహారయాత్ర కోసం నంద్యాల జిల్లా మహానంది క్షేత్రానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతులను గజ్జల అంకాలు (50), గజ్జల జనార్ధన్, గజ్జల భవాని(20), గజ్జల నరసింహ(20), సన్నీగా గుర్తించారు. మరొకరి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. గాయపడిన వారిలో జీతన్, శిరీష ఉన్నారు. వారంతా బాపట్ల జిల్లా స్టువర్టుపురం వాసులుగా గుర్తించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వివరించారు. ప్రమాద సమయానికి ముందు కారు, లారీలు రెండు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని అందుకే ప్రమాద తీవ్రత బాగా పెరిగిందని పోలీసులు వెల్లడించారు. కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్నారు. ఇక ఈ ప్రమాద ఘటనకు సంబంధించి.. సమీపంలోని పెట్రోల్ బంకులోని సిసి కెమెరాలో రికార్డు అయిందని తెలిపారు

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు**

రోడ్డు ప్రమాదం ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మహానంది వెళ్లొస్తున్న ఆరుగురు మృతి బాధాకరమన్నారు. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి ప్రమాదానికి గల కారణాలను అధికారు లను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.



# ఇజ్రాయిల్ దాడుల్లో 85, ఆకలితో 29 మంది మృతి

గాజా మే 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తూనే ఉంది. ఈ దాడుల వల్ల ఇప్పటికే వేలాది మంది మృతి చెందారు. అయినప్పటికీ ఇజ్రాయిల్ భూ ఆక్రమణ కోసం పాలస్తీనియన్లను అతిదారుణంగా హతమారుస్తూనే ఉంది. తాజాగా గురువారం తెల్లవారుజామున నుండి మొదలైన ఇజ్రాయిల్ దాడుల వల్ల కనీసం 85 మంది మృతి చెంది ఉంటారని వైద్య వర్గాలు మీడియాకు వెల్లడించాయి. మరోవైపు దాడుల వల్ల మాత్రమే కాదు.. అక్కడ ఆకలి మరణాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఆకలిని తట్టుకోలేక ఇటీవలి కాలంలో 29 మంది చిన్నారులు, ముసలివాళ్లు మృతి చెందారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. ఇంకా వేలాది మంది పాలస్తీనియన్లు ఆకలితో అలమటిస్తున్నారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది.



# నేను రాజీనామా చేస్తా :

## ముహమ్మద్ యూనస్

ఢాకా : గత సంవత్సరం నుంచి బంగ్లాదేశ్ నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షపార్టీలు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్‌ని తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అయితే ఈ విషయంలో రాజకీయ పార్టీలు తనకు మద్దతు ఇవ్వకపోతే కచ్చితంగా తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ బెదిరించారని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. అయితే యూనస్‌ని రాజీనామా చేయవద్దని కేబినెట్ మంత్రులు అతనిని ఒప్పించినట్లు అక్కడ స్థానిక మీడియా పేర్కొంది.
కాగా, గురువారం యూనస్ పాలనకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) మద్దతుదారులు కవాతు నిర్వహించారు. నిరసనలు చేశారు. ఆ దేశంలో ఎన్నికలు జరపాలని, ఎన్నికల తేదీని ఖరారు చేయాలని బిఎన్‌పి పార్టీ మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో యూనస్ రాజీనామాకు సిద్ధమయ్యారు. అయితే ఈ విషయంపై నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్ నహిద్ ఇస్లామ్ మీడియాతో మాట్లాడుతూ.. 'యూనస్ రాజీనామా చేయనున్నారనే విషయం తెలిసి మేమంతా యూనస్‌ని కలిశాము. ఆ సమయంలో యూనస్ తాను రాజీనామా విషయంపై ఆలోచిస్తున్నానని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను పని చేయలేనని.. అందుకే రాజీనామాకు సిద్ధమవుతున్నట్లు చెప్పారని' ఆయన అన్నారు.

# తీవ్రవాదంపై పోరులో బాసటగా వుంటాం

## పునరుద్ఘాటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్- భారత అఖిలపక్ష బృందంతో భేటీ




అబూదాబి : ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా చేసే పోరాటంలో భారత్‌కు తమ పూర్తి మద్దతు వుంటుందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) గురువారం పునరుద్ఘాటించింది. ఉగ్రవాదమనేది అంతర్జాతీయ ముప్పు అని మానవాళికి ఒక రుగ్మత వంటిదని వ్యాఖ్యానించింది. ఆపరేషన్ సిందూర్, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి ప్రపంచ దేశాలకు తెలియజెప్పేందుకు శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే నేతృత్వంలో వచ్చిన భారత అఖిలపక్ష ప్రతినిధి బృందంతో సమావేశం అనంతరం ఫెడరల్ నేషనల్ కౌన్సిల్‌కి చెందిన రక్షణ, హోం, విదేశాంగ వ్యవహారాల కమిటీ చైర్మన్ అలీ రషీద్ అల్ నౌమి ఈ వ్యాఖ్యలు చేశారు. తీవ్రవాదం కేవలం ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన ముప్పు కాదు, ఇది అంతర్జాతీయ ముప్పు. ఈ విషయమైన అంతర్జాతీయ సమాజమంతా ఏకతాటిపైకి రావాలని మేం విశ్వసిస్తున్నాం. మానవాళికి మరింత మెరుగైన భవితవ్యాన్ని కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించడంలో కసరత్తు చేయడానికి పార్లమెంట్ సభ్యులు కలిసికట్టుగా ముందుకు రావాలి." అని అల్ నౌమి కోరారు. భారత ప్రజల భద్రత విషయంలో రాజీపడేది లేదని, భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని చెప్పారు. యుఎఇ బృందంతో తమ సమావేశం, చర్చలు విజయవంతంగా జరిగాయని, భారత్‌పై దాడిని ఖండించిన మొదటి దేశం యుఎఇ అని షిండే తెలిపారు.

# హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి అనుమతి నిరాకరణ



వాషింగ్టన్ : హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకునే అనుమతిని ట్రంప్ యంత్రాంగం రద్దు చేసింది. యూనివర్శిటీపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నొయెమ్ పేర్కొన్నారు. హార్వర్డ్ యూనివర్శిటీకి గురువారం పంపిన లేఖలో ఆమె పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభయ్యే ముందు హార్వర్డ్ స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ సర్టిఫికేషన్( విదేశీ విద్యార్థులకు అనుమతి) తిరిగి పొందే అవకాశాన్ని కోరుకుంటే.. వారు 72 గంటల్లోపు అవసరమైన సమాచారాన్ని అందించాల్సి వుంటుందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ యూనివర్శిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ఇతర క్యాంపస్‌లకు బదిలీ కావాల్సి వుంటుంది లేదా చట్టపరమైన హోదాను కోల్పోతారని తెలిపింది. ఈ చర్య హార్వర్డ్‌ను హింస, యూదు వ్యతిరేకతకు బాధ్యులుగా చేస్తుంది. విదేశీ విద్యార్థులను యూనివర్శిటీలో చేర్చుకోవడం హక్కు కాదు, ప్రత్యేక హక్కు అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. విదేశీ విద్యార్థుల నుండి వసూలు చేస్తున్న అధిక ట్యూషన్ ఫీజులు యూనివర్శిటీ బిలియన్ డాలర్ల నిధిని నింపడానికి సహాయపడుతోందని అన్నారు. యూనివర్శిటీ సమాచారం ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో హార్వర్డ్‌లో సుమారు 6,800 మంది విదేశీ విద్యార్థులను చేర్చుకోగా, యూనివర్శిటీ మొత్తం నమోదులో ఇది 27శాతం. ప్రతి ఏడాది 500 నుండి 800 మంది భారతీయ విద్యార్థులు మరియు స్కాలర్లు హార్వర్డ్‌లో చదువుతున్నారని యూనివర్శిటీ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ప్రస్తుతం భారతదేశం నుండి 788 మంది విద్యార్థులు హార్వర్డ్ యూనివర్శిటీలో చేరారు.

### అండమాన్ నికోబార్ దీవుల


# గగనతలం మూసివేత...

## నోటమ్ జారీ!

**అండమాన్ నికోబార్ గగనతలంలో భారత్ క్షిపణి పరీక్షలు - మే 23, 24 తేదీల్లో హై ఆల్టిట్యూడ్ వెపన్ టెస్టులు**

**రెండు రోజులు గగనతలం తాత్కాలిక మూసివేత - ఉదయం 7 గంటల నుంచి మూడు గంటల పాటు ఆంక్షలు**

**విమానయాన సంస్థలకు నోటమ్ జారీ చేసిన అధికారులు - పౌర విమానాల రాకపోకలపై నిషేధం**



భారత రక్షణ శాఖ అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో కీలకమైన క్షిపణి పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, మే 23, 24 తేదీలలో నిర్దిష్ట సమయాల్లో ఆ ప్రాంత గగనతలాన్ని మూసివేయనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ మేరకు విమానయాన సంస్థలకు అధికారికంగా నోటీస్ టు ఎయిర్‌మెన్ (నోటమ్) జారీ చేశారు. అండమాన్ నికోబార్ గగనతలంలో మే 23 (శుక్రవారం), మే 24 (శనివారం) తేదీలలో భారత్ హై ఆల్టిట్యూడ్ వెపన్ టెస్టులు (ఎత్తైన ప్రదేశాల్లో ఆయుధ పరీక్షలు) చేపట్టనుంది. ఈ పరీక్షల కారణంగా, రెండు రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి మూడు గంటల వ్యవధిలో గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్లు అధికారులు తమ ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో అండమాన్ నికోబార్ గగనతలంలో ఎలాంటి పౌర విమానాలు ప్రయాణించడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. గతంలో కూడా ఇటువంటి క్షిపణి పరీక్షలను ఈ ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు గుర్తుచేశారు. దేశీయంగా ఆయుధాల తయారీని వేగవంతం చేయడంలో భాగంగా, రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ఇటువంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రయాణికుల భద్రత, పరీక్షల విజయవంతమైన నిర్వహణ దృష్ట్యా ఈ తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు సమాచారం. విమానయాన సంస్థలు ఈ నోటమ్‌కు అనుగుణంగా తమ సర్వీసులను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపడానికి లేదా సమయాల్లో మార్పులు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

# వాతావరణ అంచనాల్లో సరికొత్త విప్లవం

## మైక్రోసాఫ్ట్ 'అరోరా' ఏఐ మోడల్

**వాతావరణ అంచనాల కోసం మైక్రోసాఫ్ట్ నుంచి 'అరోరా' అనే కొత్త ఏఐ మోడల్**

**తుఫాన్లు, వాయు కాలుష్యం, సముద్ర అలలపై కచ్చితమైన అంచనాలు**

**సంప్రదాయ పద్ధతుల కన్నా వేగంగా, తక్కువ ఖర్చుతో ఫలితాలు**

**పది లక్షల గంటల వాతావరణ సమాచారంతో 'అరోరా'కు శిక్షణ**

**'నేచర్' జర్నల్‌లో ఈ ఏఐ పనితీరుపై మైక్రోసాఫ్ట్ పరిశోధకుల వ్యాసం**

**విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో కీలకం**

ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, తరచూ సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో, వీటిని ముందుగానే కచ్చితత్వంతో అంచనా వేయగల సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఈ దిశగా మైక్రోసాఫ్ట్ పరిశోధకులు 'అరోరా' అనే ఒక సరికొత్త కృత్రిమ మేధ (ఏఐ) నమూనాని అభివృద్ధి చేశారు. ఇది కేవలం వాతావరణాన్నే కాకుండా, వాయు కాలుష్యం, సముద్రపు అలల ఉద్ధృతి వంటి పలు పర్యావరణ అంశాలను కూడా అత్యంత కచ్చితంగా, వేగంగా అంచనా వేయగలదని 'నేచర్' జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనంలో వెల్లడించారు. అరోరా అనేది ఒక 'ఫౌండేషన్ మోడల్'. అంటే, విస్తృతమైన సమాచారంతో దీనికి శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత నిర్దిష్టమైన పనుల కోసం మరింత మెరుగ్గా తీర్చిదిద్దవచ్చు. దాదాపు పది లక్షల గంటల పాటు ఉపగ్రహాలు, రాడార్లు, వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన సమాచారం, ఎన్నో దశాబ్దాలుగా సేకరించిన డేటా, గత వాతావరణ నమూనాలు, అంచనాలతో అరోరాకు శిక్షణ ఇచ్చారు. ఇంత భారీ డేటాతో ఏఐ వాతావరణ నమూనాకు శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారని మైక్రోసాఫ్ట్ పరిశోధకులు తెలిపారు. ఈ ప్రాథమిక శిక్షణ తర్వాత, తక్కువ మొత్తంలో అదనపు డేటాను ఉపయోగించి గాలి నాణ్యత, సముద్రపు అలల ఎత్తు, తుపానుల గమనం వంటి నిర్దిష్ట అంశాలను అంచనా వేయడానికి అరోరాను 'ఫైన్-ట్యూన్' చేశారు. ఇలా ఫైన్-ట్యూన్ చేసినప్పుడు, మధ్యంతర వాతావరణ అంచనాల్లో (సుమారు 14 రోజుల వరకు) ప్రస్తుతం ఉన్న సంఖ్యాత్మక నమూనాలు, ఇతర ఏఐ పద్ధతుల కంటే అరోరా 91 శాతం లక్ష్యాల్లో మెరుగైన ఫలితాలనిచ్చింది. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే, అరోరా సెకన్ల వ్యవధిలోనే అంచనాలను రూపొందించగలదు. ఇది దాదాపు 5,000 రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. శిక్షణకు అయ్యే ఖర్చు అధికంగా ఉన్నప్పటికీ, ఒకసారి వ్యవస్థ సిద్ధమయ్యాక నిర్వహణ వ్యయం చాలా తక్కువని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఫిలిప్పీన్స్‌ను 2023 జూలైలో తాకిన 'డోక్సూరి' తుపాను తీరం దాటే ప్రాంతాన్ని అరోరా నాలుగు రోజుల ముందే కచ్చితంగా అంచనా వేసింది. అధికారిక అంచనాలు మాత్రం తుపాను ఉత్తర తైవాన్ తీరానికి దూరంగా వెళుతుందని అంచనా వేశాయి. అలాగే, 2022-2023 సీజన్‌లో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన తుపానుల గమనాన్ని అంచనా వేయడంలో ఏడు ప్రధాన వాతావరణ కేంద్రాల కంటే అరోరా మెరుగైన పనితీరు కనబరిచింది. 2022 జూన్‌లో ఇరాక్‌ను అతలాకుతలం చేసిన ఇసుక తుపానును కూడా అరోరా ఒకరోజు ముందే, తక్కువ ఖర్చుతో కచ్చితంగా అంచనా వేసింది. జపాన్‌ను 2022 సెప్టెంబర్‌లో తాకిన 'నాన్‌మడోల్' వంటి తీవ్ర తుపానుల సమయంలో సముద్రపు అలల ఎత్తును కూడా ప్రస్తుత నమూనాల కంటే కచ్చితంగా అంచనా వేయగలిగింది. వాతావరణ శాస్త్ర రంగంలో మరిన్ని ఆవిష్కరణలకు దోహదపడేలా మైక్రోసాఫ్ట్ అరోరా సోర్స్ కోడ్, మోడల్ వెయిట్స్‌ను బహిరంగంగా అందుబాటులో ఉంచింది. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ ఎంఎస్ఎన్ వెదర్ కూడా అరోరా ఏఐ నమూనాలను వినియోగిస్తోంది. భవిష్యత్తులో అరోరా ప్రస్తుత వాతావరణ అంచనా వ్యవస్థలకు ప్రత్యామ్నాయం కాకుండా, వాటికి అదనపు బలంగా నిలుస్తుందని పరిశోధకులు భావిస్తున్నారు.








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శనివారం 24 మే 2025

## సరిపల్లికుంటలో భూ- రీ సర్వే పూర్తి



**పోలవరం, మే 23 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన సరిపల్లి కుంట గ్రామంలోభూముల -రీ- సర్వే -పూర్తి అయినట్లు తహాశీ ల్దార్ సాయి రాజు తెలిపారు. గురువారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి వివరాలు వెల్లడించారు సర్వేపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 45 మందికి రైతులకు సంబంధించిన సుమారు 66 ఎకరాల భూములకు రి సర్వే పూర్తయిందని తహశీల్దార్ సాయిరాజు పత్రికా ప్రకటనలో తెలిపారు.

## టూరిస్టులకు బ్యాడ్ న్యూస్

### -పాపికొండల విహారయాత్రకు బ్రేక్



**పోలవరం, మే 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** పోలవరం మండలం పాపికొండల విహారయాత్రకు టూరిజం బోటుమీద వెళ్ళే టూరిస్టులకు బ్రేక్ పడింది. పోలవరం మండలంలో వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో శుక్రవారం పాపికొండల విహారయాత్రను అధికారులు రద్దు చేశారు. ఈదురు గాలులు వర్షాల కారణంగా మూడు రోజులు పాటు బోటు సర్వీసులు నిలిపివేశారు. జాగ్రత్త చర్యగా పర్యాటక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది గండి పోచమ్మ ఆలయం వద్ద టూరిజం బోటులు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పోలవరం నుంచి వెళ్లే టూరిస్టులు వెనుదిరిగారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా


### -ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి)** ప్రజల సమస్యలకు సరైన పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం క్యాంపు కార్యాలయం వద్ద ఆనందరావు శుక్రవారం నాడు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని తెలిపారు. నేడు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పలు వినతులు వచ్చినట్లు తెలిపారు. సమస్యలను బట్టి వాటి పరిష్కార సమయం ఉంటుందని అన్నారు. ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు.

## సివి రామన్ పూర్వ విద్యార్థికి ఉన్నత కొలువు

**అమలాపురం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి)**



అమలాపురం సర్ సివి రామన్ పాఠశాలలో పదో తరగతి వరకు విద్యాబుద్ధులు నేర్చుకున్న బండారి నరేష్ ఆపై ఉన్నత చదువుల్లో రాణించి ఐటి రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి హైదరాబాద్ కు చెందిన క్వాల్కమ్ సంస్థలో ఉన్నత కొలువు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ఉపాధ్యాయులను కలిసి ఆనందాన్ని పంచుకున్నాడు. ఈ ఆనంద సమయంలో బండారి నరేష్, అతని తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థాపకులు రవణం రాంబాబు ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని, ఆయన ఉండి ఉంటే ఈ సమయాన ఎంతో సంతోషించే వారని అన్నారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. బండారు నరేష్ ను స్కూల్ యాజమాన్యం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, పాఠశాల శ్రేయోభిలాషి మల్లవరపు ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ కె. పెద్దిరాజు, ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరాజు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సమర్థ వంతంగా నిర్వహించాలి


### -కొత్తపేట ఆర్డీవో శ్రీకర్



**అమలాపురం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి)** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో చేపడుతున్న పనులను ఎటువంటి అవినీతికి తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ కోరారు. మండలంలోని ఆలమూరు,పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.మస్తర్ల సంఖ్యకు అనుగుణంగా కూలీల సంఖ్య ఉందో లేదోనని తనిఖీ చేశారు. ఉపాధి పనులు చేసే సమయంలో కల్పిస్తున్న సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు నిర్దేశించిన కొలతల ఆధారంగా పనులు చేయించాలని, నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పిడుగు సూచనలు, సలహాలు అందచేశారు. ప్రతిరోజూ ఉపాధి పనుల ప్రగతిని తెలియజేయాలని ఎంపీడీఓ ఏ రాజు, ఏపీఓ జి. అరుణకుమారిని ఆదేశించారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, మాజీ జడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, డిప్యూటీ తహాశీల్దార్ టి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి బ్రదర్స్ నర్సరీ నిర్వహణ బాగుంది

### - కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీకృష్ణారావు



**కడియం,మే 23(తెలుగురాష్ట్రం విలేకరి)** మొక్కల ఉత్పత్తి ,పెంపకం, కూర్పులో కడియం నర్సరీ రైతులకు వేరెవరు సాటిరారని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీకృష్ణారావు పేర్కొన్నారు. కడియం ఉమా పార్వతీ నర్సరీని ఆయన సందర్శించారు.దశాబ్దాల నాటి మర్రి,రావి,గానుగ వంటి వృక్షాలు మొక్కలు ఈ నర్సరీలో ఉండటం ఆయన్ని విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈసందర్భంగాఎస్పీ మాట్లాడుతూ యువ నర్సరీ రైతులు కోత్తపల్లి శివాజీ, మూర్తి సోదరులు సృష్టిస్తున్న వైవిధ్యభరితమైన టాల్ బోన్సాయ్ మొక్కల అధ్బుతం గా ఉన్నాయన్నారు.నర్సరీలో వంద సంవత్సరాల వయసు ఉన్న భారీ వృక్షజాతి చెట్లను సేకరించి ఎలా సంరక్షిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు పెంపకం గురించి కడియం నర్సరీ సంఘం మాజీ ఉపాధ్యక్షులు శివాజీ,మూర్తి లు ఎస్పీ కి వివరించారు.ప్రత్యక్షంగా పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్న రైతులను వారికున్న శ్రద్ధను ఈసందర్భంగా ఎస్పీ శ్రీకృష్ణారావు అభినందించారు. ఈకార్యక్రమంలో అడబాలస్వామి, బండారు రాము,వెన్నపు అయ్యప్ప, సురేష్ , సాయి తదితరులు ఉన్నారు.

## బిజెపి మలికిపురం మండల కమిటీ ఎన్నిక

### -మండల అధ్యక్షులుగా చాణిక్య

**మలికిపురం మే 23 (తెలుగురాష్ట్రం విలేకరి)**



భారతీయ జనతాపార్టీ మలికిపురం మండల కమిటీని జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామంలోని బలుసులమ్మ ఆలయం వద్ద శుక్రవారం అధికారికంగా ప్రకటించారు.మండల అధ్యక్షులుగా మేడిచర్ల చాణక్య,ప్రధాన కార్యదర్శులుగా కట్టా వాసు,కనుమూరి రామచంద్ర రాజు,ఉపాధ్యక్షులుగా అనిశెట్టి బాలాజీ,దెందుకూరి రామలింగరాజు,ఆరేటి శ్రీను,పెమ్మాడి మోహన్ లాల్,ముత్యాల తాతంబాబు,తోట ఉమామహేశ్వరి,కార్యదర్శులుగాదళం సత్యనారాయణ,తాడి రవీంద్ర,పేరిచర్ల సీతాదేవి,మాగాపు సాయి సరస్వతి,మేడిచర్ల అశ్విని,అడపా సత్తిబాబు,కోశాధికారిగా కలిగిత శిరీష,సోషల్ మీడియా కన్వీనర్ గా గెద్దాడ గణేష్ లను ప్రకటించారు.ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు,ఇందుకూరి అచ్యుత రామరాజు,చెంపాటి శివరామ రాజు,మాజీ మండల అధ్యక్షులు కాపిశెట్టి కనికేశ్వరావు,తాడి సుభాష్,కంచి నాగేశ్వరరావు,అడబాల వెంకన్న బాబు,సుంకర రఘు బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తుందని అడబాల ఆశాభావం వ్యక్తం చేశారు..

## వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి త్వరలో మాస్టర్ ప్లాన్

### - దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్





**ఆత్రేయపురం, మే 23, (తెలుగురాష్ట్రం విలేకరి)** ప్రతి శనివారం 60 నుంచి 70 వేల మంది సందర్శించే దేవాలయంగా రాష్ట్రంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తగిన మౌలిక వసతుల కల్పించేందుకు త్వరలోనే మాస్టర్ ప్లాన్ విడుదల చేస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ కె. రామచంద్ర మోహన్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు.అనంతరం ఆలయంలో ప్రస్తుతం జరుగుతున్న పనులు, భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలపై సమీక్షించారు. త్వరలోనే భక్తులకు 50 గదులతో వసతి గృహం, డార్మెటరీ, అన్నదాన భవనం, పార్కింగ్ తదితర సౌకర్యాలను కల్పించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. మాస్టర్ ప్లాన్ విడుదల చేసేందుకు డ్రాఫ్ట్ ప్లాన్ లో మార్పులు కోసం ఈరోజు ఆలయానికి రావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే సత్యానందరావు సూచనల మేరకు కొన్ని పనులను చేర్చామని, దేవస్థానం నిధులతో త్వరలో ఆయా పనులను పూర్తి చేస్తామని చెప్పారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు చేపట్టిన ఏర్పాట్లు శాశ్వత ప్రాతిపదికన చేయాలని నిర్ణయించామన్నారు. రూ.1.30 కోట్లతో చేపట్టే డార్మెటరీ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. అలాగే వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణం పూర్తి కావడానికి ఏడాది సమయం పట్టే అవకాశం ఉన్నందున తాత్కాలిక అన్నదాన భవనం నిర్మిస్తామన్నారు. అలాగే మూడు చోట్ల పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ భక్తుల తాకిడికి తగినట్టు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తిరుమల తరహాలో క్యూలైన్లు, కంపార్ట్ మెంట్లు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు స్థల సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఉన్న గృహాల వారితో చర్చించి ఆ స్థల సమీకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలు విధించకుండానే రెండు టవర్ల నిర్మాణం

### - జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈ రాజబాబు





**అమలాపురం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి)** విద్యుత్ లైన్ల ఆధునీకరణలో భాగంగా 132 కెవి డబుల్ సర్క్యూట్ లైన్ టవర్ల పునః స్థాపనకు సంబంధించి నిర్దేశించిన రోజు వారి లక్ష్యం మేరకు గురువారం రెండు టవర్ల నిర్మాణం ఎలాంటి విద్యుత్ కోతలు విధించకుండానే పూర్తి చేసామని అంబేద్కర్ కోనసీమ జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈ ఎస్. రాజబాబు తెలిపారు. పాత టవర్లు తొలగించి వాటి స్థానంలో కొత్త టవర్ల నిర్మాణం ప్రారంభమైందన్నారు. ట్రాన్స్కో అధికారుల సమాచారం ప్రకారం సాయంత్రం నాటికి పనులు పూర్తవుతాయన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ కోతలు విధించకుండా టవర్ల ఏర్పాటు పూర్తయిందన్నారు. శుక్రవారం కూడా లాక్ 30, 31లో మరో 2 పాత టవర్లను తొలగించి రెండు కొత్త టవర్లను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ కోతలు విధించకుండా ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా 'వారణాసి' చిత్రం విడుదల

### - యూట్యూబ్ లో విడుదల చేసిన ఎమ్మెల్యే బండారు





**రావులపాలెం, మే 23, (తెలుగురాష్ట్రం విలేకరి) :** నవ యువ దర్శకుడు, కథారచయిత పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన అడబాల రాహుల్ రాయ్ దర్శకత్వం వహించి నిర్మించిన వారణాసి చిత్రం అందరి ఆదరణ పొంది విజయం సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆకాంక్షించారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా ఈ చిత్ర పోస్టర్ ను ఆవిష్కరించి చిత్రాన్ని యూట్యూబ్ లో విడుదల చేసారు.ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ తాను తెలుగు సినీ రచయితల సంఘ సభ్యుడిగా ఉంటూ అధ్బుతమైన మెసేజ్ ఓరియెంటెడ్ కథలు అనేకం రాసుకొని ఆ కథలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. వెండితెరపై మంచి దర్శకుడిగా ఎదగాలన్నది తన కలని అన్నారు. అందుకోసం ముందుగా ఈ డిపెండెంట్ మూవీ వారణాసిని తన స్వీయ దర్శకత్వంలో నిర్మించానని తెలిపారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న దారుణ ఘటనలు వాటికి తగిన శిక్షల గురించి ఈ సినిమాలో అధ్బుతంగా చిత్రీకరించానని చెప్పారు. ఈ సినిమాలో మచిలీపట్నానికి చెందిన కొక్కిలిగడ్డ నరసింహ, కొత్తపేటకి చెందిన పాటల రచయిత కవి కోటిపల్లి రామకృష్ణ, ఆయన మనుమరాలు జాహ్నవి ప్రధాన పాత్రల్లో నటించగా, శశిదేవి, గూడపాటి బూరయ్య, సాంబమూర్తి, కొత్తపేటకి చెందిన యువకులు కోటిపల్లి దామోదర్, వలపుశెట్టి కిరణ్, నేదునూరి సూర్య కిరణ్, చోడపనీడి ప్రకాశం, కుంచనపల్లి ఆదిత్య, సూర్య సాధనాల తదితరులు వివిధ పాత్రల్లో నటించారన్నారు. ఈసినిమా మొత్తం సామ్ సంగ్ కంపెనీకి చెందిన గెలాక్సీ ఫోన్ ద్వారా యిలాయి బుడ్డి వెలుగులో చిత్రీకరించడం కూడా ఈ మూవీ ప్రత్యేకత అని తెలిపారు. ఈ మూవీ చూడాలనుకొనే వారు రాహుల్ రాయ్ కోడ్ అనే యూట్యూబ్ ఛానల్ లో వీక్షించవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి సినిమాలు తీసి దర్శకుడిగా ఎదగాలని దర్శకుడు రాహుల్ రాయ్, చిత్ర టీం ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కొత్తపేట మండల అధ్యక్షులు గనిశెట్టి వీరేష్, టిడిపి నాయకులు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియా అరాచకాలు అరికట్టండి

### -నిబంధనల కు విరుద్ధంగా ఇసుక అధిక లోడ్ తరలింపు ఆపాలి-సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్




**రాజమహేంద్రవరం, మే 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** జిల్లాలో ఇసుక మాఫియా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు కారణంగా ఇప్పటికే కొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని ఇంకేన్ని ప్రాణాలు ఇసుక మాఫియాకు బలైపోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ప్రశ్నించారు. ఈ మేరకు సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యంతో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేశారు, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు వల్ల రోడ్ పైన ఇసుక పడి వాహనదారులు జారిపడి ప్రాణాలు కోల్పోతున్నా ఇసుక మాఫియా అరాచకాలు ఆగడం లేదని అరుణ్ విమర్శించారు. ఇసుక నిబంధనల కన్నా ఎక్కువ మోతాదులో లారీల్లో తరలించడం ద్వారా చాలా చోట్ల ముఖ్యమైన రహదారులు నిండా ఇసుక భారీ స్థాయిలో పేరుకుపోయిందని దీని ఫలితంగా వాహనదారులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అరుణ్ అన్నారు. ఇటీవల ధవళేశ్వరం లో కానిస్టేబుల్ కుమార్తె ను ఎక్కించుకుని వెళుతూ జారిపడి ప్రాణాలు కోల్పోయారని ,అదే ధవళేశ్వరం లో సాయిబాబా గుడి వద్ద యువకుడు ఇసుకలో జరిపడటం వెనుక నుండి వచ్చిన లారీ ఎక్కడంతో నుజ్జు నుజ్జు అయి ప్రాణాలు కోల్పోయారని ఇలాంటివి కోకొల్లలుగా జరుగుతున్నా ఇసుక మాఫియా ఆగడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేసి ఇసుకు తొడుకుపోతున్నారని విమర్శించారు. జిల్లాలో రాజమండ్రి, ధవలేశ్వరం , కొవ్వూరు తదితరు ఇసుక ర్యాంపులో ఉన్న ప్రాంతాల్లో రహదారులు మరింత దుబ్బరంగా మారాయని వివరించారు.వెంటనే ఉన్నత అధికారులు ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను, అరాచకాలను అరికట్టాలని లేకపోతే మరిన్ని ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే ఇసుక అధిక లోడ్ లను నియంత్రించాలని లేకపోతే తామే ప్రజలను సమీకరించి ఇసుక అధిక లోడ్ తో వెళ్లే లారీలను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

# బిషప్ డాక్టర్ థామస్ కు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు




**రాజమహేంద్రవరం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి) :** దహించు అగ్ని వ్యవస్థాపకులు బిషప్ డాక్టర్ థామస్ కు ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ ( అమెరికా ) వారు అవార్డు బహుకరించారు. హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అవార్డును బహుకరించినట్లు డాక్టర్ థామస్ తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం లోని దహించు అగ్ని ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు పొందిన సందర్భంగా, బిషప్ డాక్టర్ థామస్ మాతృమూర్తి దివంగత మేరీ సెల్వం జ్ఞాపకార్థం మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ మెడికల్ క్యాంపులో రాజమహేంద్రవరంలోని 10 మంది ప్రముఖ డాక్టర్లు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు, లక్ష రూపాయలు విలువైన ఉచితంగా మందులు పంపిణీ, కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిషప్ డాక్టర్ థామస్ మాట్లాడుతూ గత 34 సంవత్సరాలు కాలంగా తాను పేదలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా 139 దేశాలలో గుర్తింపు కలిగిన అమెరికన్ సంస్థ, " ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ అవార్డు " ఇచ్చి తనను సత్కరించినట్లు తెలిపారు. దహించు అగ్ని మినిస్ట్రీస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. ఆంధ్రప్రదేశ్లో 1000 క్రైస్తవ సంఘాలు ఉన్నాయని, అలాగే తెలంగాణలో 800 క్రైస్తవ సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఉభయ రాష్ట్రాలలో మొత్తం 1800 క్రైస్తవ సంఘాల ద్వారా ప్రతిరోజు 200 మందికి భోజనం సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. అలాగే యువకులకు వృత్తివిద్య నైపుణ్యంలో శిక్షణ, పదివేల మంది క్రైస్తవులకు తర్ఫీదు కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. అలాగే వితంతువులకు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడంతోపాటు, కుట్టు మిషన్ల పంపిణీ చూస్తున్నామని తెలిపారు. మెగా మెడికల్ క్యాంపు లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, జక్కంపూడి రామ్మోహన్ రావు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ యువకులు రక్తదానం చేశారని తెలిపారు. ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపులో లక్ష రూపాయలు విలువైన మందులు కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేసామని పేర్కొన్నారు. అందరూ సోదర భావంతో మెలగాలి :ప్రస్తుత సమాజంలో కుల మత వర్ణ వర్గ విభేదాలు తో ఘర్షణలు జరుగుతున్నాయని ఇవి రూపుమాపాలని అన్నారు. భారతీయులందరూ సోదర భావంతో అందరూ సమానంగా జీవించాలని పిలుపు ఇచ్చారు. తన సేవా కార్యక్రమాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని సుమారు ఐదు అవార్డు లు అంతర్జాతీయంగా లభించాయని తెలిపారు. భవిష్యత్తులో తను సమాధాన దూతగా అన్ని మతాలను కలుపుకొని అందరూ కలిసిమెలిసి జీవించాలని లక్ష్యంతో మానవాళి శాంతి సమాధానానికి కృషి చేస్తానని పిలుపు ఇచ్చారు. బిషప్ డాక్టర్ థామస్ సతిమణి షీబా థామస్ మాట్లాడుతూ బిషప్ డాక్టర్ థామస్ కు అంతర్జాతీయ పీస్ అంబాసిడర్ అవార్డు లభించిన పట్ల దహించు అగ్ని మినిస్ట్రీస్ సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు ఉచిత వైద్యం మందులు పంపండి చేసినట్లు తెలిపారు. దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సీతానగరం మండలం కాటవరం గ్రామంలో పేదలకు వస్త్రాలు ఆహారం ధన సహాయం అందజేస్తున్నట్లు వివరించారు తనకు విదేశీ క్రైస్తవ సంఘాలు లేకపోయినప్పటికీ తమకు వచ్చే ఆదాయం లోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వితంతువులకు లకు కుట్టు మిషన్లు పంపిణీ చేసామని అన్నారు. కాటవరం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. సమాజంలో అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు .

# ఇసుక మాఫియా అరాచకాలు అరికట్టండి

### -నిబంధనల కు విరుద్ధంగా ఇసుక అధిక లోడ్ తరలింపు ఆపాలి - ఇంకెన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోవాలి -ప్రభుత్వం స్పందించకపోతే ఇసుక లారీలను అడ్డుకుంటాం. -సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్



**రాజమహేంద్రవరం, మే 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** జిల్లాలో ఇసుక మాఫియా నిబంధనల కు విరుద్ధంగా ఇసుక తరలింపు కారణంగా ఇప్పటికే కొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని ఇంకేన్ని ప్రాణాలు ఇసుక మాఫియాకు బలైపోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం తో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేశారు, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు వల్ల రోడ్ పైన ఇసుక పడి వాహనదారులు జారిపడి ప్రాణాలు కోల్పోతున్నా ఇసుక మాఫియా అరాచకాలు ఆగడం లేదని అరుణ్ విమర్శించారు. ఇసుక నిబంధనల కన్నా ఎక్కువ మోతాదులో లారీల్లో తరలించడం ద్వారా చాలా చోట్ల ముఖ్యమైన రహదారులు నిండా ఇసుక భారీ స్థాయిలో పేరుకుపోయిందని దీని ఫలితంగా వాహనదారులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అరుణ్ అన్నారు. ఇటీవల ధవళేశ్వరం లో కానిస్టేబుల్ కుమార్తె ను ఎక్కించుకుని వెళుతూ జారిపడి ప్రాణాలు కోల్పోయారని ,అదే ధవళేశ్వరం లో సాయిబాబా గుడి వద్ద యువకుడు ఇసుకలో జరిపడటం వెనుక నుండి వచ్చిన లారీ ఎక్కడంతో నుజ్జు నుజ్జు అయి ప్రాణాలు కోల్పోయారని ఇలాంటివి కోకొల్లలుగా జరుగుతున్నా ఇసుక మాఫియా ఆగడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేసి ఇసుకు తొడుకుపోతున్నారని విమర్శించారు. జిల్లాలో రాజమండ్రి, ధవలేశ్వరం , కొవ్వూరు తదితరు ఇసుక ర్యాంపులో ఉన్న ప్రాంతాల్లో రహదారులు మరింత దుబ్బరంగా మారాయని వివరించారు.వెంటనే ఉన్నత అధికారులు ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను, అరాచకాలను అరికట్టాలని లేకపోతే మరిన్ని ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే ఇసుక అధిక లోడ్ లను నియంత్రించాలని లేకపోతే తామే ప్రజలను సమీకరించి ఇసుక అధిక లోడ్ తో వెళ్లే లారీలను అడ్డుకుంటామని పేర్కొన్నారు.

# బాలికలు, మహిళల రక్షణకై ప్రత్యేక చర్యలు




**రాజమహేంద్రవరం, మే 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** జిల్లా అంతట స్కూళ్లు, కాలేజీలు, గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద శక్తి టీముల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో మహిళలు, బాలికల రక్షణకై తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా పోలీసు అధికారులు, శక్తి టీంలతో సమీక్షా సమావేశం నిర్వహించి, శక్తి టీంల పనితీరును స్వయంగా పరిశీలించి, మెరుగైన పనితీరుకై తగిన సలహాలు, సూచనలు ఇచ్చిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగానే ప్రతి పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్ మరియు మహిళల ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్క మహిళ తమ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ నో ఇన్స్టాల్ చేసుకోవాలని, తద్వారా పోలీసు సేవలు 24%శ%7 మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.బీ.ఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్)అర్జున్, డి.ఎస్.పి( ఎస్ బి) బి. రామకృష్ణ, డి.ఎస్.పి( మహిళా పిఎస్)కే.వీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ (ఎస్.బి)ఏ. శ్రీనివాసరావు, జోనల్ డిఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.

# అవార్డులు బాధ్యతను పెంచుతాయి : కలెక్టర్

### -ఘనంగా నగరపాలక సంస్థ వార్షికోత్సవ అవార్డుల వేడుక




**రాజమహేంద్రవరం, మే 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వార్షికోత్సవ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలు గాదాలమ్మ టెంపుల్ రోడ్డులోని బీవీఆర్ శ్రీ కన్వెన్షన్ నందు గురువారం ఘనంగా జరిగాయి. కమిషనర్ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో కలెక్టర్ పి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు, ఎస్పీ డి నరసింహ కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అధికారులు, ఉద్యోగులందరూ సందడి చేశారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి ఇటువంటి కార్యక్రమాలు ఆటవిడుపని, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ అవార్డులతో ఉద్యోగులపై బాధ్యత మరింత పెరిగిందని.. భవిష్యత్తులోనూ ఇదే రీతిలో నగర ప్రజల కోసం పూర్తిస్థాయిలో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి నగరపాలక సంస్థను రానున్న రోజుల్లో మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని ఈ వేదిక ద్వారా సత్కరించుకోవటం సంతోష దాయకమన్నారు. గడిచిన ఏడాది కాలంలో నగరం అభివృద్ధిలో దూసుకుపోతోందని.. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితోనే ఇది సాధ్యపడిరదని చెప్పారు. ఈ అవార్డులు ఉద్యోగులలో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు వారిపై బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకువెళ్లాలని కోరారు. రానున్న రోజుల్లో మీ అందరి సహాయసహకారాలతో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంటుదనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. అనంతరం పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను మెమోంటోలు, ప్రశంసాపత్రాలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణ నాయక్, ఆర్డిఎంఏ నాగ నరసింహరావు, అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకట రమణ, సెక్రటరీ జి.శ్శైలజావల్లి, ఎస్ఈ(ఇంజనీరింగ్) ఎం.సీహెచ్.కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, ఇతర అధికారులు, ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య.





**ఏలూరు,మే 23,(తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఏలూరు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. శుక్రవారం ఏలూరు విచ్చేసిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ని పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తో కలిసి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ కె.వెట్రీసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రబాకర్ ,సొంగ రోషన్ కుమార్ లతో కొద్ది సేపు ముచ్చటించారు.

# ఆయిల్ పామ్ యాక్ట్ మాదిరిగా కోకో పంటకు మద్దత్తు ధరకు కొత్త చట్టాన్ని తీసుకువస్తాం

### -రైతుల ఇబ్బందులు, సమస్యలపై వెంటనే స్పందిస్తాం -ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న కోకో పంటను మొత్తాన్ని వెంటనే కంపెనీలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నాం -రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు



**ఏలూరు, మే, 23,(తెలుగురాష్ట్రం విలేకరి)** రాష్ట్రంలోని కోకో పంటకు కనీస మద్దత్తు ధర నిర్ణయించే విధంగా త్వరలో చట్టాన్ని తీసుకువస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం కోకో రైతుల సమస్యలపై రైతులు, అధికారులు, ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, శాసనసభ్యులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నుముక అని, రైతుల ఇబ్బందులు, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. గత సంవత్సరం వరకు కోకో పంటకు రైతులకు లాభదాయకమైన ధరను సదరు ట్రేడర్లు, కంపెనీలు అందించాయని, కానీ ప్రస్తుత సంవత్సరం రైతులను ఇబ్బంది పెట్టే విధంగా కోకో ట్రేడర్లు, కంపెనీలు కోకో ధరను తగ్గించి కొంటున్నాయని రైతులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు రైతుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారన్నారు. కోకో రైతులకు భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కోకో పంటకు అంతర్జాతీయ మార్కెట్ లో రేటునకు అనుగుణంగా కనీస మద్దత్తు అందించేందుకు ఆయిల్ పామ్, మిర్చి వంటి వాణిజ్య పంటలకు వర్తించేవిధంగా కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు, ట్రేడర్లకు నష్టం కలగని రీతిలో చట్టం రూపకల్పనకు రైతులు, రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని వారి అభిప్రాయాలను కూడా చట్టంలో పొందుపరుస్తామన్నారు. అదే సమయంలో రైతులు నాణ్యమైన ఉత్పత్తులు సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రైతులు వద్ద వెయ్యి నుండి 1500 టన్నుల వరకు ఉన్న కోకో పంటను కేజీకి 500 రూపాయలు చొప్పున అందించేలా, దానిలో 450 రూపాయలు కోకో కొనుగోలు చేసే కంపెనీలు, మిగిలిన 50 రూపాయలు కంపెనీలతో చర్చించి ప్రభుత్వం అందించేలా కోకో రైతులు, ట్రేడర్లతో, కంపెనీల యజమానులతో మంత్రి మాట్లాడి సమస్యను పరిష్కరించారు. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కోకో పంటకు సరైన ధర అందించడంలో ట్రేడర్లు, కంపెనీలు విఫలమవుతున్న సమయంలో దళారీ వ్యవస్థ లేకుండా కంపెనీలకు కోకో పంటను నేరుగా రైతులే అందించేలా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. కోకో పంటకు గత సంవత్సరం, ప్రస్తుత ధరకు చాలా వ్యత్యాసం ఉండడంతో కోకో ధర నిర్ణయించేందుకు ఆయా కంపెనీలు నిర్దిష్టమైన విధానాన్ని అనుసరించాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కోకో రైతులు సమస్య తెలియజేసిన వెంటనే స్పందించి రైతులు, ట్రేడర్లు, కంపెనీల వారితో సమావేశం ఏర్పాటుచేయడం శుభపరిణామమన్నారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన మంత్రులకు చింతమనేని ప్రభాకర్ కృత్ఞతలు తెలియజేసారు. రైతు ఏ .బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోకో దేశీయ వినియోగం 1. 20 లక్షల టన్నులు కాగా, సుమారు 20 శాతం మేర 30 వేల మెట్రిక్ టన్నులు దేశంలో ఉత్పత్తి అవుతుందన్నారు. మిగిలిన 80 శాతం విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో పంట విలువ డాలరు మారకం విలువ, డిమాండ్, సప్లై వంటి పలు అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. గత సంవత్సరం కిలో కోకో 900 రూపాయలకు పైగా పలికిన ధర , ప్రస్తుతం 300 నుండి 400 రూపాయలు పడిపోయిందని, కంపెనీల వారు కోకో కొనుగోలు చేసేందుకు రైతులకు ఎన్నో షరతులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, తేమ శాతం, ఫంగస్ పేరుతో తక్కువ ధరకు కొంటున్నారన్నారు. ఎంతో విస్తరణ అవకాశం ఉన్న కోకో పంటను రాష్ట్రంలో విస్తరించనివ్వకుండా కంపెనీలు దుర్భర పరిస్థితిని కల్పిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బి. రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య , డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, ఉద్యాన శాఖ డిడి ఎస్ రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా,రైతు సంఘాల నాయకులూ కె. శ్రీనివాస్, వివిధ రైతు సంఘాల నాయకులూ, రైతులు ప్రభృతులు పాల్గొన్నారు.



# ఆదివాసి పోరాటాలకు రాజకీయాలు అడ్డుకాదు



**చింతూరు, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి):**

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలం రిలే నిరాహార దీక్షను శుక్రవారం నాడు చింతూరు ఎంపీపీ సవలం అమల, చట్టి గ్రామానికి చెందిన పెసా కమిటీ కార్యదర్శి పొడియం రామకృష్ణ (రాంబాబు) ప్రారంభించారు. దీక్ష ప్రాంగణంలో ముందుగా కొమరం భీమ్, బిర్సం ముండా ఫోటోలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అలాగే దీక్షలో పాల్గొన్న యువతీ యువకులకు పూలమాలవేసి దీక్షను ప్రారంభించారు. దీక్షను ఉద్దేశించి మాట్లాడుతూ ఆదివాసి పోరాటాలకు రాజకీయ పార్టీలు అడ్డు కాకూడదని తెలియజేస్తూ ఇటువంటి పోరాటాల్లో యువతి యువకులు భారీగా పాల్గొని భవిష్యత్తు తరాలకి ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ మన హక్కుల సాధనకై అందరూ ఐక్యతతో ముందుకు రావాలని తెలిపారు. అలాగే మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ఆదివాసి టీచర్స్ పోస్టులు మినహాయించి 100% ఉద్యోగాలను ఆదివాసి నిరుద్యోగులతో తోనే భర్తీ చేయాలి. అలాగే ప్రత్యేక డిఎస్సి ని కూడా విడుదల చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసుల సాక్షిగా ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 28 శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టి బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఐటీడీఏ ల ద్వారా ట్రైకర్ రుణాలు నిరుద్యోగ యువతీ, యువకులకు మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కార కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ పిలుపుమేరకు చట్టి గ్రామ యువతి, యువకులు, రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేశారు. కార్యక్రమంలో చింతూరు ఎంపీపీ సవలం అమల, ఏడుగురాళ్లపల్లి సర్పంచ్ సత్తిబాబు, ఏజి కోడేరు సర్పంచ్ అగరం సుబ్బలక్ష్మి, ముకునూరు సర్పంచ్ బి.సత్యకుమారి, గంగన్న మెట్ట సర్పంచ్ వేక ప్రసాద్, తుమ్మల సర్పంచ్ కొవ్వాసి రామారావు, పేగ ఎంపిటిసి సున్నం నాగరాజు, జేఏసీ చింతూరు మండల కార్యదర్శి కాకా సీతారామయ్య. తుర్రం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ కి పార్టీ పరిస్థితులు వివరించిన రైతు నాయకులు



**కామవరపుకోట, మే 23 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**

కామవరపుకోటకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టిడిపి రైతు సంఘం నాయకులు, మాజీ ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి భర్త నాగేశ్వర రాంబాబు మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లిలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. జిల్లా, మండల పార్టీ పదవుల ఎంపిక జరుగుతున్న సమయంలో మంత్రి లోకేష్ ను మద్దిపోటీ కలవటం ఆసక్తిని కలగజేస్తుంది.

# వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

**కామవరపుకోట, మే 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. కామవరపుకోట పురవీదులలో జై శ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో యువకులు డిజె సౌండ్ సిస్టంతో బైకుల ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు బస్టాండ్, చెక్పోస్ట్, దుర్గ మహల్, సౌతనా సెంటర్, పాతూరు, ముదిరాజుల రామాలయం మీదుగా శోభాయాత్రను నిర్వహించారు. బజరంగ్ దళ్ తరఫున నందూరి భాను, జల్లి అంజిబాబు ఆధ్వర్యంలో జరిగిన పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

## దాసు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పున్నేశ్వరరావు

**టీ.నర్సాపురం, మే23 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



టీ.నర్సాపురం మండలంలోని వెంకటాపురం, బొర్రంపాలెం గ్రామాల దాసు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటాపురం గ్రామానికి గజ్జెల పున్నేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం వెంకటాపురం గ్రామంలో సంఘం సమావేశం నేలటూరి సత్య మాస్టారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలలో పున్నేశ్వరరావు సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గంలో ఉపాధ్యక్షులు తిరుక్కోళ్లూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జెట్టి అరుణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా తిరుక్కోళ్లూరి రాఘవేంద్రరావు, కోశాధికారి మొగరాజు శేషు, క్రియాశీలక సభ్యులు తిరుక్కోవల్లూరి సామ్రాజ్యం, జెట్టి నరసింహారావు, వీధి అశోక్, బట్టు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పల్లం రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దాసు ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు సాంప్రదాయ పునరుద్ధరణకు అంకితంగా పని చేయాలన్నారు. నూతన అధ్యక్షుడు పునేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల అందరి సహకారంతో సంఘ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యవర్గం ఏర్పాటుకు కృషి చేసిన దాసు సంక్షేమ పెద్దలు పల్లం రవికుమార్ కు, నేలటూరి సత్యనారాయణకు (ద్వారకాతిరుమల), కోరం నరేష్ (అచ్చన్నపాలెం-నల్లజర్ల మండలం) కు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సంఘం పెద్దలు పాముల వరప్రసాద్, జెట్టి రామకృష్ణ, పోలుకొండ నరసింహ, తిరుక్కోవల్లూరి లోహిదాస్, గజ్జల సుబ్రహ్మణ్యం, సముద్రపు కోటేశ్వరరావు (బ్యాంకు ఉద్యోగి) , తిరుక్కోవల్లూరి భారతి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మద్ది ఆంజనేయ స్వామి వారి గ్రామోత్సవం



**జంగారెడ్డిగూడెం, మే 23(తెలుగురాష్ట్రం విలేకరి):**

మద్ది ఆంజనేయ స్వామి వారికి ఉదయం ఐదు గంటల 30 నిమిషాలకు నుండి ప్రభాత సేవ నిత్యార్చన నిత్య హోమం, బలిహరణలు అనంతరం ఆలయ ముఖమండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై శ్రీ స్వామి అమ్మవార్లను ఆసీనులను చేసి అశేష భక్త సమూహం నడుమ అర్చక స్వాములు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. సదరు కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం 6 గంటల నుండి వివిధ నేలతాడాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అంగరంగ వైభవంగా గురవాయిగూడెం చక్రదేవర పల్లి గ్రామాలలో స్వామివారి గ్రామ ఉత్సవం నిర్వహించబడినది. ఈరోజు అయినవిల్లి గ్రామానికి చెందిన సుస్మిత విరాళముగా రూ51,160/- ఆలయ పర్యవేక్షకులు రంగారావు ద్వారా సమర్పించారు. రాతన స్వామి వారి విశేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారని ఈవో తెలిపారు. రేపు అనగా స్థిర వారం ఉదయం 5:30 గంటల నుండి ప్రభాత సేవ నిత్యార్చన నిత్య హోమం పరిహరణలు అనంతరం ఉదయం 9 గంటలకు ఉపాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాయంకాల హోమము మహా శాంతి హోమం బలిహరణలు నిర్వహించబడునని దేవస్థానం కార్య నిర్వహణ అధికారిని ఆర్ వి చందన తెలిపారు.

# బియ్యంకార్డులో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ

**-వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే నిత్యావసరాలు.-జూన్ 1నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు.**



**ఏలూరు,మే 23, (తెలుగు రాష్ట్రం విలేఖరి):**

జిల్లాలో అన్ని గ్రామ, వార్డు, సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు ధరఖాస్తుల స్వీకరణతోపాటు 7 రకాల సేవలను పారదర్శకంగా పునఃప్రారంభించడమైనదని జిల్లా పౌర సరఫరాల అధికారి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు పి. శివరామమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి వారి నేతృత్వంలో రైస్ కార్డులు, రబీధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డులకు ధరఖాస్తులు స్వీకరణతోపాటు కార్డుల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన సేవలను ప్రారంభించామన్నారు. కొత్త బియ్యం కార్డు అందించడం బియ్యం కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేర్చుట, బియ్యంకార్డులో సభ్యుల పేర్లు విడదీయుట, మరియు కొత్తకార్డు మంజూరు, బియ్యంకార్డులో సభ్యులపేర్లు తొలగించుట, బియ్యంకార్డును సరెండర్ చేయుట, బియ్యంకార్డులో చిరునామా మార్పులు చేయుటకు కార్డులో తప్పుడు ఆధార్ నెంబర్ సీడింగ్ చేసుకునే అవకాశం కలిగిందన్నారు. రైస్ కార్డు సేవలపై ఏమైనా సందేహాలు ఉన్నచో 1800-425-6453 నెంబరుతో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కు కార్యాలయ పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ సందేహాలు తెలియజేసి నివృత్తి పొందవచ్చన్నారు. కొత్త రైస్ కార్డులు పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అయితే కుటుంబ సంవత్సర ఆదాయం లక్షా 20 వేలు లోపు, పట్టణ ప్రాంతాల్లో అయితే లక్షా 40 వేలు ఆదాయం లోపు ఆదాయం మించకుండా ఉండాలన్నారు. గతంలోవున్న ఎండియు వాహనాలను రద్దుపరిచి జూన్ 1 నుంచి చౌకధరల దుకాణాలవద్దే రేషన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. చౌకధరల డిపోల వద్ద ప్రతినెలా 1వతేదీ నుంచి 15వతేదీ వరకు రేషన్ తీసుకోవచ్చన్నారు. 65 సంవత్సరాలు పైబడి, దివ్యాంగులు వంటి వారు రేషన్ షాపుకు వచ్చి రేషన్ తీసుకోని పరిస్థితుల్లో ఉంటే అటువంటి వారి ఇంటికే సంబంధిత డీలర్ డోర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా నిర్వహించడం జరిగిందన్నారు. రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి ఇంతవరకు 2.51 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇంకా మెట్టప్రాంతం, రైతుల దగ్గర ధాన్యం నిల్వవుంటే వారి దగ్గర నుంచి నాణ్యతాప్రమాలకు అనుగుణంగా కొనుగోలుచేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 20,416 మంది రైతుల నుంచి రూ. 579 కోట్లవిలువైన ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటికే రూ. 502 కోట్లు వారి ఖాతాలకు జమచేయడం జరిగిందన్నారు. మిగిలిన రూ.72 కోట్లు ఈరోజు , సోమవారం లోపు వారి ఖాతాలకు జమ అవుతాయన్నారు. అకాల వర్షాలు వచ్చినప్పటికీ ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు అందుబాటులో ఉండి టార్పాలిన్లు అందించడం, రవాణా సౌకర్యం కల్పిండం వంటి చర్యలు తీసుకున్నారన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే 08812-230448, 7702003584 నెంబర్లతో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

# బిజెపి పార్టీలో సామాన్యులకు సైతం సముచిత స్థానం

**- ఈనెల 28న రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం .. ఎంపీ పాక**



**భీమవరం మే 23,(తెలుగురాష్ట్రం విలేకరి)**

బిజెపి పార్టీ సామాన్యులకు సైతం సముచిత స్థానం ఇస్తుందని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. భీమవరం బిజెపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న డిల్లీలో రాజ్యసభ సభ్యునిగా మధ్యాహ్నం 12 గంటల తరువాత ఉప రాష్ట్రపతి ఛాంబర్ లో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలంగా పని చేసిన వారికి వెనుకబడిన తరగతులకు చెందిన వారికి అత్యుత్తమ స్థానం కల్పించి పెద్దల సభలకు బీజేపీ పంపించిందని, తనకు పార్టీ పట్ల ఉన్న నిబద్ధత అవగాహన ప్రామాణికంగా తీసుకుని నాకు ఈ అవకాశం కల్పించిందని అన్నారు. భీమవరం లో ఇరువురు నాయకులకు లోక్ సభ స్థానం, రాజ్యసభ స్థానం అందించిన ఘనత బీజేపీ కే దక్కుతుందని అన్నారు. పార్లిమెంట్ లో వేరు వేరు సభలకు ప్రాతినిధ్యం వహించి తాము రాష్ట్ర అభివృద్ధికి కూటమి బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన రాజ్యసభ అభ్యత్వాన్ని ఏపీ బీజేపీ ఏకగ్రీవంగా బలపరచి ప్రతిపాదించినందుకు ధన్యవాదములు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ కష్టపడి వారిని పార్టీ గుర్తిస్తుంది అనడానికి ఇరువురు నాయకులను పార్టీ గుర్తించి ఇటువంటి పదవులు ఇవ్వడమే నిదర్శనమని అన్నారు. ఈ పదవులు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, కాగిత సురేంద్ర, అల్లూరి సాయి దుర్గరాజు, తోట గంగరాజు, పద్మావతి, రాఘవులు, ఉన్నమట్ల కపర్తి, పట్టణ అధ్యక్షులు వబిలిశెట్టి ప్రసాద్, అడబాల శివ, కోమటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మేలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**-సబ్సిడీపై పశువుల దాణా సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**




**భీమవరం మే 23, (తెలుగురాష్ట్రం విలేకరి)**

రైతులను అదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల పథకాలను అందిస్తుందని, పాడి రైతులకు సబ్సిడీపై దాణా ను సరఫరా చేస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం తాడేరు గ్రామంలోని రైతు బజార్ భరోసా కేంద్రంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశువుల దాణా సబ్సిడీపై సరఫరా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. రాయితీపై పశు దాణా రైతులకు అందించి వారిలో ధీమా కలిగిస్తున్నామని, పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడటానికి రాయితీపై పశువులకు నాణ్యమైన సమీకృత దాణా సరఫరా చేస్తున్నామన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు 50 శాతం రాయితీ అందిస్తున్నామని, 50 కిలోల దాణా సంచి రూ 1110 అని, 50 శాతం రాయితీతో రూ 555 లు రైతులు చెల్లించాలన్నారు. ప్రస్తుతం భీమవరం మండలంలో 1000 మంది రైతులకు ఈ రాయితీని అందిస్తున్నారని, మొదటి విడతగా 250 మందికి ఇలా నాలుగు విడతలుగా 1000 మందికి పశువుల దాణా సబ్సిడీపై సరఫరా చేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రంలోనూ, పశు వైద్యాశాలలో గాని సంప్రదించవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. అనంతరం పాడి రైతులకు పశువుల దాణాను అందించారు. కార్యక్రమంలో తాడేరు గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల్లోనే రేషన్ పంపిణీ

**- రేషన్ డీలర్లు సన్నద్ధం కావాలి- జాయింట్ కలెక్టర్ నిషాంతి**




**అమలాపురం, మే 23, (తెలుగురాష్ట్రం విలేఖరి):**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు జిల్లాలోని డీలర్లు సన్నద్ధం కావాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి డీలర్లను ఆదేశించారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ లో ఎల్.పి.జి, రేషన్ డీలర్లతో ఆమె సమావేశం నిర్వహించి డీలర్ల ద్వారా రేషన్ సరఫరా, దీపం-2 సిలిండర్ సొమ్ము జమ, డెలివరీ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునః ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జూన్ 1వ తేదీన పండగ వాతావరణంలో రేషన్ షాపులను పునః ప్రారంభించాలన్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అందరి సమన్వయంతో ఆదర్శంగా పని చేస్తుందన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని డీలర్లు ఒక సేవా కార్యక్రమంగా మానవసేవ మాధవ సేవగా భావించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎల్పీజీ డీలర్లు, డెలివరీ సిబ్బంది ద్వారా ఆన్లైన్ చెల్లింపులు నిర్వహించి రసీదులు జారీ చేస్తూ ఆ మేరకే చార్జీలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారుల నుంచి అదనపు చార్జీలు అంతస్తుల పేరిట వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారుల నుంచి ప్రభుత్వానికి ఆర్టిజిఎస్ ఐవిఆర్ఎస్ వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయాల సేకరణలో అధిక ధరలు పేరిట అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం ద్వారా కొత్త రేషన్ కార్డులు జారీ, మార్పులు చేర్పులు సంబంధించి విధి విధానాలు అందుబాటులోకి వచ్చేయన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్పిజి సిలిండర్ ధరలు ముందుగానే లబ్ధిదారుల ఖాతాకు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రక్రియలో సమస్యలు ఉత్పన్నమైనట్లయితే సిబ్బంది పూర్తిగా సహకరిస్తారన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడి వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, పంపిణీలో డీలర్లు అత్యంత పారదర్శకత పాటించాలని సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీఎస్ఓ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు పూర్తి స్థాయిలో ఈ నెలాఖరు నాటికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రేషన్ దుకాణాల ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థపై కార్డుదారులకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు పౌర సేవలు అందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధరలు, స్టాక్ బోర్డులను సరైన విధంగా చౌక ధరల దుకాణాల ముందుభాగ%శీ%లో స్పష్టంగా కనబడేలా ప్రదర్శించాలన్నారు. ఏదైనా సాంకేతిక సహకారం కావాలంటే టీమ్ లు సిద్ధంగా ఉన్నాయన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన రేషన్ డీలర్ల పై ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.బాల సరస్వతి, ఎల్పీజీ డీలర్ల ప్రతినిధి త్రినాథ్, రేషన్ డీలర్ల ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు



# టాప్ 2 రేసు రసవత్తరం

## ఆ టీమ్స్‌కు ఎలిమినేటైన జట్లు షాకిస్తే?

ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసు ముగిసింది. ఇక మిగిలింది టాప్ 2 కోసం పోరు మాత్రమే. ప్లేఆఫ్స్ చేరిన గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ జట్లు.. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచేందుకు తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఎందుకంటే ఇక్కడికి చేరిన జట్లకు క్వాలిఫయర్‌లో ఓడినా.. మరో అవకాశం ఉంటుంది. మరోవైపు టేబుల్‌లో అట్టడుగున ఉన్న జట్లు.. టాప్ 2 రేసుపై ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. దీంతో ఈ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.



### గుజరాత్ కు ఇలా..

పాయింట్ల పట్టికలో టాప్‌లో కొనసాగుతున్న గుజరాత్‌కు.. ప్లేఆఫ్స్ నుంచి ఎలిమినేట్ అయిన లఖ్‌నవూ గత మ్యాచ్‌లో షాకిచ్చింది. దీంతో ఆ జట్టు టాప్ 2 అవకాశాలు క్లిష్టంగా మారాయి.

గుజరాత్ మరో మ్యాచ్ మాత్రమే ఆడాల్సి ఉంది. అందులో గెలిచినా ఆ జట్టు ఖాతాలో చేరేవి 20 పాయింట్లు.

అప్పుడు గుజరాత్ టాప్ 2 భవితవ్యాన్ని ఆర్సీబీ, పంజాబ్ తేల్చనున్నాయి.

ఒకవేళ అట్టడుగున ఉన్న చెన్నై.. చివరి మ్యాచ్‌లో గుజరాత్‌కు షాకిస్తే శుభ్‌మన్ గిల్ సేన మూడో స్థానానికి పడిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

### ఆర్సీబీ భవితవ్యం ఇలా..

17 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్న బెంగళూరు.. తదుపరి మ్యాచ్‌లు సన్‌రైజర్స్, లఖ్‌నవూతో ఆడనుంది.

ఈ రెండు మ్యాచ్‌లు గెలిస్తే.. టాప్ 1లోకి వచ్చే అవకాశం ఉంది.

ఒకవేళ సన్‌రైజర్స్, లఖ్‌నవూ షాకిస్తే మాత్రం.. ఆర్సీబీ టాప్ 2 అవకాశాలు గల్లంతే.

సన్‌రైజర్స్ ఇప్పటికే లఖ్‌నవూను ప్లేఆఫ్స్‌నకు దూరం చేసింది. ఇక గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్‌కు లఖ్‌నవూ షాకిచ్చింది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందో చూడాలి.

### పంజాబ్ కింగ్స్ దూసుకెళ్తుందా..?

11 ఏళ్ల తర్వాత శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ప్లేఆఫ్స్‌కు చేరిన జట్టు పంజాబ్.. 17 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

దిల్లీ, ముంబయితో తదుపరి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలో గెలిస్తే.. 21 పాయింట్లతో టాప్ 2లోకి వెళ్లే అవకాశం ఉంది.

ఒక్కటి ఓడినా.. పైనున్న జట్ల ఫలితాలపై దీని టాప్ 2 భవితవ్యం ఆధారపడి ఉంది.

### ముంబయికి కష్టమే..

ముంబయి ఆడాల్సింది ఒక మ్యాచ్ మాత్రమే.. అదీనూ టాప్ 3లో ఉన్న పంజాబ్‌తో పంజాబ్‌పై ఓడితే పాండ్య సేన నాలుగో స్థానంలోనే ఉంటుంది.

పంజాబ్‌పై గెలిచినా.. ముంబయి ఖాతాలో చేరేవి 18 పాయింట్లు. అప్పుడు టాప్ 2లోకి చేరాలంటే.. మిగతా మూడు జట్లు రాబోయే అన్ని మ్యాచ్‌లు ఓడిపోవాలి.

ఇక ఇప్పటికే ఎలిమినేటై పరువు కోసం చెన్నై, హైదరాబాద్, లఖ్‌నవూ, దిల్లీ ఆడుతున్నాయి. ఆఖరి మ్యాచ్‌ల్లో ఆ జట్లు విజృంభిస్తే.. ప్లేఆఫ్స్‌కు చేరిన జట్లకు కష్టాలు తప్పవు. దీంతో ప్రతి మ్యాచ్ ఫలితం. నెట్ రన్‌రేట్ టాప్ 4 జట్లకు కీలకంగా మారనుంది.

# ఇంగ్లండ్ టూర్‌కు ఆ స్టార్ పేసర్ దూరం..?



**ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు టీమ్‌ఇండియా జట్టును శనివారం ప్రకటించనున్నారు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో.. ఎవరికి సారథ్య బాధ్యతలు అప్పగిస్తారన్న విషయం ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఈ సిరీస్‌కు స్టార్ పేసర్ మహమ్మద్ షమీ దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తుండటం టీమ్‌ఇండియా అభిమానులను కలవరానికి గురిచేస్తోంది.**

షమీ టెస్టుల్లో సుదీర్ఘ స్పెల్స్ వేయలేడని బీసీసీఐ వైద్యబృందం యాజమాన్యానికి చెప్పినట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. అతడిని జట్టులోకి తీసుకుంటే.. ఐదు టెస్టులూ ఆడే అవకాశాలు చాలా తక్కువని ఆ కథనాల్లో పేర్కొన్నారు. ఇంగ్లండ్ సిరీస్‌కు మరో 20 రోజులే సమయం ఉన్న నేపథ్యంలో ఈ వార్త టీమ్‌ఇండియాను ఇబ్బందికి గురిచేసేదే. మరోవైపు టెస్టు కెప్టెన్సీ రేసులో ఉన్న బుమ్రా కూడా.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ వల్ల అన్ని టెస్టులు ఆడే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో టీమ్‌ఇండియా జట్టును ఎంపిక చేయనున్న సెలక్షన్ కమిటీ ఈ విషయంలో సందిగ్ధంలో పడినట్లు సమాచారం. భారత జట్టు ప్రణాళికలపై కూడా ఇది ప్రభావం చూపించే అవకాశం ఉంది.

"షమీ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున నాలుగు ఓవర్లు వేశాడు. అయితే.. అతడు ఒక రోజులో పది ఓవర్ల కంటే ఎక్కువ ఓవర్లు వేస్తాడా.. అన్న విషయం బోర్డుకు, సెలెక్టర్లకు తెలియదు. ఇంగ్లండ్‌లో టెస్టుల్లో పేసర్లు ఎక్కువ స్పెల్స్ వేసే అవసరం ఉండొచ్చు. మేం ఎలాంటి ఛాన్స్‌లు తీసుకోలేం" అని ఓ బీసీసీఐ అధికారి ఆంగ్ల మీడియాకు తెలిపినట్లు సమాచారం.

ఒకవేళ షమీని పక్కనపెడితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు లేదా హరియాణా పేసర్ అన్షుల్ కాంబోజ్‌కు అవకాశం లభించవచ్చు. ఇక షమీ 2023 WTC Finalలో ఓవల్‌లో ఆస్ట్రేలియాపై చివరిసారిగా టెస్టు ఆడాడు.

ఇక టెస్టు కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా పోటీలో ఉన్నారు. సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కడం ఖాయం. కోహ్లి, రోహిత్‌ల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత జట్టు ఎంపిక జరగనుంది.

# కరచాలనం సమయంలో పంత్‌ను గిల్ పట్టించుకోలేదా..?

**ఈ ఐపీఎల్ సీజన్‌లో ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన లఖ్‌నవూ జట్టు.. పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న గుజరాత్ కు షాకిచ్చింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టును 33 పరుగుల తేడాతో ఓడించింది. అయితే.. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ఓ పరిణామంపై ఇప్పుడు క్రికెట్ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఆటగాళ్ల కరచాలనం సమయంలో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రవర్తనపై పలువురు కామెంట్లు చేస్తున్నారు.**




గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే పాయింట్ల పట్టికలో టాప్2 లో కొనసాగే అవకాశాలు మరింత మెరుగయ్యేవి. అయితే.. ఈ ఓటమి అనంతరం.. ఇరు జట్ల ఆటగాళ్ల కరచాలనం సమయంలో గిల్ నిరాశగా కనిపించినట్లు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. గిల్‌కు లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ షేక్‌హ్యాండ్ ఇచ్చి.. ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించినా పట్టించుకోకుండా ముందుకుసాగాడు. దీంతో గిల్‌పై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

పంత్‌ను గిల్ పట్టించుకోకుండా ముందుకుసాగాడని.. ఓటమితో నిరాశలోనే ఇలా చేశాడని పలువురు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఈ ఇద్దరూ టీమ్‌ఇండియా జట్టులో కీలక ఆటగాళ్లు అన్న విషయం తెలిసిందే. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో.. ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు గిల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారని.. వైస్ కెప్టెన్‌గా పంత్ ఉంటాడని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు ఈ ఓటమిపై గిల్ స్పందిస్తూ.. తమ బౌలర్లు లఖ్‌నవూకు 20–30 పరుగులు అదనంగా ఇచ్చారని.. అదే ఓటమికి దారితీసిందని వ్యాఖ్యానించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రత్యర్థిని 210 పరుగులకే ఆపి ఉండాల్సిందని పేర్కొన్నాడు. ఇక ఈ విజయంపై పంత్ సంతోషం వ్యక్తంచేశాడు. జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నాడు. వరుసగా నాలుగు ఓటముల అనంతరం లఖ్‌నవూకు దక్కిన విజయమిది.

# వివాదంలో పంజాబ్ జట్టు.. కోర్టుకెక్కిన ప్రీతి జింటా!

**పంజాబ్ కింగ్స్ జట్టులో వివాదం చెలరేగింది. ఆ జట్టు సహ యజమాని, బాలీవుడ్ నటి ప్రీతి జింటా కోర్టుకెక్కింది. జట్టు సహ డైరెక్టర్లు అయిన మోహిత్ బుర్మాన్, నెస్ వాడియాపై చండీగఢ్ కోర్టులో కేసు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా వీరు సమావేశం నిర్వహించారంటూ పిటిషన్ వేసింది.**



వీరు ముగ్గురు కేపీహెచ్ డ్రీమ్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా ఉన్నారు. ఐపీఎల్ లోని పంజాబ్ కింగ్స్ జట్టు ఈ కంపెనీదే. గత నెల 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశం చట్టబద్ధతను ప్రీతి జింటా కోర్టులో సవాలు చేసింది. కంపెనీ చట్టం 2013 ప్రకారం ఎలాంటి నిబంధనలు పాటించకుండానే ఈ సమావేశాన్ని నిర్వహించారని తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ భేటీకి సంబంధించి అభ్యంతరాలను తాను ఏప్రిల్ 10నే ఈమెయిల్ రూపంలో తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని ఆమె పేర్కొంది. నెస్ వాడియా మద్దతుతో మోహిత్ బర్మాన్ ఈ సమావేశాన్ని నిర్వహించారని ఆరోపించింది. తాను, మరో డైరెక్టర్ కరణ్ పాల్ ఈ సమావేశానికి హాజరైనప్పటికీ.. ఈ సమావేశం చట్టబద్ధత చెల్లదని ప్రకటించాలని ప్రీతి జింటా కోర్టును కోరింది. ఈ సమావేశంలో మునీశ్ ఖన్నాను డైరెక్టర్‌గా నియమించడాన్ని ప్రీతి జింటా, పాల్ వ్యతిరేకించారు. డైరెక్టర్‌గా ఖన్నా నియామకాన్ని నిలిపివేయాలని ఆమె తన పిటిషన్‌లో కోర్టును కోరింది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కంపెనీ అమలుచేయకుండా చూడాలని అభ్యర్థించింది. ఈ కేసు పరిష్కారం అయ్యేవరకూ.. తాను, కరణ్‌పాల్ లేకుండా బోర్డు సమావేశాలు నిర్వహించకుండా చూడాలని ప్రీతి జింటా కోర్టును కోరారు.

### గుజరాత్‌కు పంచ్.. లఖ్‌నవూ చేతిలో ఓటమి

బోర్డులో వివాదాలు ఉన్నప్పటికీ.. ప్రీతి జింటా పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు హాజరై స్టేడియంలో జట్టుకు మద్దతుగా నిలిచింది. ఆటగాళ్లను ప్రోత్సహించింది. ఇక శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్న విషయం తెలిసిందే. 11 ఏళ్ల అనంతరం ఆ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరింది. టాప్ 2లో స్థానం లక్ష్యంగా ముందుకుసాగుతోంది.

# ఒక్కరోజులో 498

నాటింగ్‌హామ్:

**ఒక్కరోజులో దాదాపు 500 పరుగులు! టెస్టుల్లో కొన్నేళ్లుగా దూకుడుగా ఆడుతున్న ఇంగ్లాండ్ మరోసారి అదరగొట్టింది. జింబాబ్వేతో ఏకైక టెస్టు తొలిరోజే పరుగుల వరద పారించింది. ముగ్గురు బ్యాటర్లు శతకాలు చేశారు. దీంతో మొదటి ఇన్నింగ్స్‌లో ఆట చివరికి ఇంగ్లాండ్ 3 వికెట్లకు 498 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (124), బెన్ డకెట్ (140) సెంచరీలు సాధించడమే కాక.. తొలి వికెట్‌కు 231 పరుగులు జత చేసి గట్టిపునాది వేశారు. ఒలీ పోప్ (169 బ్యాటింగ్) కూడా అజేయ సెంచరీ బాదడంతో ఇంగ్లాండ్ 500 పరుగులకు చేరువైంది. రూట్ (34) ఔట్ అయ్యాడు. ఆట ఆఖరికి పోప్‌కు తోడుగా బ్రూక్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. 500 పరుగుల మైలురాయిని అందుకునే అవకాశాన్ని ఇంగ్లాండ్ కొద్దిలో కోల్పోయింది. టెస్టు చరిత్రలో అయిదు సందర్భాల్లో మాత్రమే ఒక్కరోజులోనే 500 స్కోరు నమోదైంది.**



### ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు ఎంపిక రేపు

ముంబయి: ఇంగ్లాండ్‌లో అయిదు టెస్టుల సిరీస్ ఆడే భారత జట్టును శనివారం ప్రకటిస్తారు. శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ కోసం పోటీలో ఉన్నారు. సాయి సుదర్శన్, అర్ష్‌దీప్ సింగ్‌లకు తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కడం ఖాయం. కోహ్లి, రోహిత్‌ల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత జట్టు ఎంపిక జరగనుంది.

### బెతెల్ స్థానంలో సీఫర్ట్

దిల్లీ: న్యూజిలాండ్ వికెట్ కీపర్– బ్యాటర్ టిమ్ సీఫర్ట్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తీసుకుంది. జాతీయ జట్టు బాధ్యతల కారణంగా జట్టుకు దూరంకానున్న ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ స్థానంలో సీఫర్ట్‌ను బెంగళూరు ఎంపిక చేసుకుంది. రూ.2 కోట్లకు అతడితో ఒప్పందం చేసుకుంది. శనివారం నుంచి ఆర్సీబీకి సీఫర్ట్ అందుబాటులో ఉంటాడని బీసీసీఐ పేర్కొంది. శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచే ఈ సీజన్‌లో బెతెల్‌కు ఆఖరిది. కివీస్ తరఫున 66 టీ20 మ్యాచ్‌లాడిన సీఫర్ట్ 1540 పరుగులు సాధించాడు. ఐపీఎల్‌లో కేవలం మూడు మ్యాచ్‌లే ఆడిన అతడు.. 2022లో చివరి సారిగా పొట్టి లీగ్‌లో బరిలో దిగాడు.

### బంగ్లాదేశ్‌పై సిరీస్ విజయం


షార్జా: టీ20 క్రికెట్లో యూఏఈ సంచలనం సృష్టించింది. పొట్టి ఫార్మాట్లో తొలిసారిగా బంగ్లాదేశ్‌పై సిరీస్ విజయం సాధించింది. మొన్న తొలిసారి బంగ్లాను ఓడించిన యూఏఈ.. నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. టీ20ల్లో ఐసీసీ పూర్తి స్థాయి సభ్య దేశంపై యూఏఈకి ఇదే మొట్టమొదటి ద్వైపాక్షిక సిరీస్ విజయం. తంజిద్ హసన్ (40బీ 18 బంతుల్లో 4ఐ4, 4ఐ6), జాకిర్ అలీ (41బీ 34 బంతుల్లో 1ఐ4, 3ఐ6), హసన్ మహమూద్ (26 నాటౌట్‌బీ 15 బంతుల్లో 3ఐ6) రాణించడంతో తొలుత బంగ్లా 20 ఓవర్లలో 9 వికెట్లకు 162 పరుగులు సాధించింది. బదులుగా మరో 5 బంతులు మిగిలివుండగానే యూఏఈ లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అలీషాన్ షరాఫు (68 నాటౌట్‌బీ 47 బంతుల్లో 5ఐ4, 3ఐ6), ఆసిఫ్ ఖాన్ (41 నాటౌట్‌బీ 26 బంతుల్లో 5ఐ6) సత్తాచాటడంతో యూఏఈ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

# సంధ్య థియేటర్ ఘటన: సీపీ సీవీ ఆనంద్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి మరోసారి నోటీసులు



డిసెంబర్ 4, 2024న హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్ (%చీఎ=జ%) హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఆరు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని %చీఎ=జ% ఆదేశించింది. అసలేం జరిగింది?గత ఏడాది డిసెంబర్ 4న ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో 'పుష్ప 2' సినిమా ప్రీమియర్ షోను చూసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఇదే సమయంలో సినిమా హీరో అల్లు అర్జున్ థియేటర్ వద్దకు రావడంతో అభిమానులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీనితో అక్కడ తొక్కిసలాట జరిగి, పరిస్థితి అదుపుతప్పింది. ఈ తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్ళాడు. సుమారు 4 నెలల 25 రోజుల పాటు చికిత్స పొందిన శ్రీతేజ్ ఇటీవల డిశ్చార్జ్ అయ్యాడు, అయినప్పటికీ అతని ఆరోగ్యం పూర్తిగా కుదుటపడలేదు.ఎన్‌హెచ్‌ఆర్‌సి చర్యలు:ఈ ఘటనపై అడ్వకేట్ రామారావు ఇమ్మనేని %చీఎ=జ%కి ఫిర్యాదు చేశారు. చిక్కడపల్లి పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ తొక్కిసలాట జరిగిందని, ఇది రేవతి మరణానికి, ఆమె కుమారుడి గాయాలకు దారితీసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో పోలీసులు సమర్పించిన నివేదికలో సరైన వివరాలు లేవని %చీఎ=జ% ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు పోలీసులు లాఠీఛార్జికి ఎందుకు దిగాల్సి వచ్చిందో, థియేటర్‌కు సమీపంలో డీజేలు, ఇంత హంగామా జరుగుతున్నా పోలీసులు ఏం చేశారో వివరణ ఇవ్వాలని కమిషన్ కోరింది. అలాగే, ప్రత్యేక షోకు అనుమతి ఇవ్వనప్పుడు అల్లు అర్జున్ థియేటర్‌కు ఎలా వచ్చారని కూడా ప్రశ్నించింది. ఈ నోటీసులతో ఈ ఘటనపై దర్యాప్తు మళ్ళీ వేగవంతం అయ్యే అవకాశం ఉంది. తొక్కిసలాట కేసులో పోలీసులు, అలాగే సంబంధిత వ్యక్తులు మరోసారి విచారణను ఎదుర్కోవాల్సి రావచ్చని తెలుస్తోంది.

# 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' చిత్రం ప్రారంభం ఎపుడంటే



టాలీవుడ్‌లో తాజాగా హైప్ తెచ్చుకున్న సినిమా అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే . 'అనగనగా' ఫేమ్ కాజల్ చౌదరి, కార్తిక్ రాజు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీ రామకృష్ణ బ్యానర్ పై గాలి కృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకత్వ బాధ్యతలు రాజా దుస్సా వహిస్తున్నారు.ఈ సినిమా మే 23న రామానాయుడు స్టూడియోలో గ్రాండ్‌గా లాంచ్ అయింది. పూజా కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొనడం విశేషం. సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, భీమనేని శ్రీనివాసరావు, క్రాంతి మాధవ్, హీరో చైతన్య లాంటి ప్రముఖులు మెరిశారు.లాంచ్ సమయంలో ఆసక్తికర ఘట్టాలు చోటు చేసుకున్నాయి. స్క్రిప్ట్‌ను తమ్మారెడ్డి అందించగా, ముహూర్తపు సన్నివేశానికి సురేష్ బాబు క్లాప్ కొట్టారు. కెమెరా స్విచ్ ఆన్ చేసిన హీరో చైతన్య కాగా, తొలి షాట్‌కి డైరెక్షన్ భీమనేని ఇచ్చారు. 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' చిత్రం ప్రారంభం ఎపుడంటేకథలో విశేషం ఏంటంటేఈ సినిమా ఓ పీరియాడికల్ డ్రామా. 1980ల వరంగల్ నేపథ్యంలో సాగుతుంది. హాస్యం, భావోద్వేగం మేళవిన ఓ యథార్థ కథ ఆధారంగా చిత్రీకరిస్తున్నారు. డైరెక్టర్ రాజా దుస్సా ఈ కథపై మంచి ఫోకస్ పెట్టారు. ఆయన గతంలో '105 మినిట్స్'తో ఆకట్టుకున్నారు.దర్శకుడు రాజా చెబుతున్నారు: ఈ సినిమా నా కలల ప్రాజెక్ట్. కార్తిక్, కాజల్ మాతో ఉండడం గర్వంగా ఉంది. గాలి కృష్ణ గారి మద్దతు ఎంతో విలువైనది.హీరో కార్తిక్ రాజు స్పందిస్తూ, ఇది 80వ దశకంలోని నిజమైన సంఘటనల ఆధారం. దర్శకుడు రాజా, నిర్మాత గారి మీద నమ్మకం చాలా ఉంది, అన్నారు.కాజల్ చౌదరి తెలిపింది: తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. ఈ సినిమా ప్రత్యేకంగా ఉంటుంది. కథ చాలా కొత్తగా ఉంది. టీమ్ కూడా చాలా ఎఫెక్టివ్.టెక్నికల్ టీం గూర్చి కొద్ది మాటలుఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి. పాటలు కాసర్ల శ్యామ్ సింగిల్ కార్డ్‌తో రాస్తున్నారు. కెమెరామెన్‌గా గంగానమోని శేఖర్ పని చేస్తున్నారు. ఆర్ట్ డైరెక్షన్ రవి కుమార్ గుర్రం భుజాలపై ఉంది.లైన్ ప్రొడ్యూసర్‌గా కీసరి నరసింహ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కార్తికేయ శ్రీనివాస్, సహ నిర్మాతలుగా మల్లవరం వెంకటేశ్వర రెడ్డి మరియు రూప కిరణ్ గంజి ఉన్నారు. ఈ టీమ్ సినిమా ప్రతీ విడిదీ పర్ఫెక్షన్‌తో ప్లాన్ చేస్తోంది.'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' కొత్త స్టోరీల కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఓ ఫ్రెష్ ఫీలింగ్ అందించబోతోంది. కొత్త యంగ్ కాంబినేషన్, 80 బ్యాక్‌డ్రాప్, పక్కా టెక్నికల్ టీమ్ కలిస్తే హిట్ గ్యారంటీ అనిపిస్తోంది


# సింగర్ కెనీషాకు బెదిరింపులు.. కారణాలు ఏంటి?



ఇటీవల కోలీవుడ్‌ను షేక్ చేస్తున్న ఒక సంచలనాత్మక పరిణామం గాయని కెనీషా చుట్టూ తిరుగుతోంది. ప్రముఖ నటుడు జయం రవితో ప్రేమ సంబంధం ఉన్నట్టుగా వచ్చిన వార్తల నేపథ్యంలో ఆమెకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. తనపై చేస్తున్న ఆరోపణల వల్ల జీవితంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నానని ఆమె సోషల్ మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వస్తున్న హత్య బెదిరింపులకు సంబంధించి స్క్రీన్‌షాట్‌లను పంచుతూ అందుకు సంబంధించి పోలీసులను సంప్రదించానని తెలిపారు.గత కొన్ని వారాలుగా జయం రవి తన భార్య ఆర్తితో విడాకులు తీసుకుంటున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. అయితే, ఆర్తి చేసిన ఆరోపణల ప్రకారం ఈ విడాకులకు కెనీషాతో రవికి ఉన్న 'స్నేహం'నే ప్రధాన కారణమని తెలిసింది. మూడో వ్యక్తి కారణంగా తమ వైవాహిక జీవితం కుదేలయ్యిందని ఆమె పేర్కొనడం వల్ల కెనీషా పేరు మరింత బయటపడింది. దీనివల్లే ఆమెపై విమర్శలు తారాస్థాయికి చేరాయి."నన్ను నేరస్తిగా చూడొద్దు" సోషల్ మీడియాలో స్పందించిన కెనీషా అంతేకాకుండా, సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలు, శాపనార్థాలపై కూడా ఆమె స్పందించారు. "మీ అందరి శాపాలు, బాధ పెట్టే మాటల వల్ల నేను ఎంత వేదన అనుభవిస్తున్నానో మీలో ఎవరైనా ఆలోచించారా? కర్మ ఎవరినీ విడిచిపెట్టదు అని మీరంతా నిందిస్తున్నారు. కానీ, నిజం బయటకు వచ్చాక మీరు కూడా ఇలాంటి బాధనే అనుభవించాలని నేను కోరుకోవడం లేదు. మీలో చాలామందికి నిజం తెలియకపోవడం వల్ల ఇలాంటి దారుణమైన మాటలతో నన్ను సులభంగా నిందిస్తున్నారు. మీ అందరి భావాలను నేను అర్థం చేసుకోగలను. కానీ, త్వరలోనే నిజం బయటపడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. నేను తప్పు చేస్తే.. చట్టం వేసే శిక్షను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను. అప్పటివరకూ నన్ను ద్వేషించకండి. ప్రశాంతంగా బతకనివ్వండి" అని కెనీషా ఆవేదనతో రాసుకొచ్చారు.ఆర్తి ఆరోపణలు, ప్రేమ వ్యవహారంపై ఊహాగానాలుకాగా, నటుడు జయం రవి తన భార్య ఆర్తి నుంచి విడాకులు (%ఎఱఙశీతీఛవ%) తీసుకుంటున్నట్లు ఇటీవలే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తనను సంప్రదించకుండానే రవి ఈ నిర్ణయం తీసుకున్నారని, విడాకుల విషయాన్ని బయటపెట్టారని ఆర్తి ఆరోపించారు. గాయని కెనీషాతో జయం రవికి ఉన్న స్నేహం కారణంగానే తమ మధ్య మనస్పర్థలు తలెత్తాయని, అందుకే ఆయన విడాకులు కోరుతున్నారని కోలీవుడ్ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. తాము వేర్వేరుగా ఉండటానికి మూడో వ్యక్తే కారణమని, అందుకు తన వద్ద తగిన ఆధారాలున్నాయని ఆర్తి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే కెనీషాకు బెదిరింపులు రావడం గమనార్హం.న్యాయం కోరుతున్న కెనీషా పోలీసుల పరిరక్షణపై ఆశ తనకు వస్తున్న బెదిరింపులు పెరుగుతుండటంతో, ఆమె పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని ఆమె నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా వేదికగా ఆమెకు మద్దతుగా కొంతమంది సెలబ్రిటీలు నిలిచినా, విరుద్ధంగా మాట్లాడేవారే ఎక్కువగా కనిపిస్తున్నారు. వ్యక్తిగత జీవితాలు పబ్లిక్‌లో చర్చకు రావడం సాధారణమైపోయిన ఈ రోజుల్లో, కెనీషా లాంటి వారుఎదుర్కొంటున్న మానసిక వేదన అర్థం చేసుకోవడం సమాజ బాధ్యతగా మారాలి.

# బాడీ షేమింగ్ విమర్శలపై స్పందించిన ఐశ్వర్యరాయ్



మరోసారి భారత అందాన్ని చాటిచెప్పారు ఐశ్వర్యారాయ్ బచ్చన్, సినిమాకు సంబంధించిన వేడుకలంటేనే తారలు ధరించే దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. అందులోనూ ఐశ్వర్యారాయ్ బచ్చన్ లాంటి స్టార్ హీరోయిన్స్ ధరించే దుస్తుల పైనే అందిరి చూపులు. ఆమె ఏ వేడుకలకు హాజరైనా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ వేడుకలకు హాజరై ఐశ్వర్య మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. భారతీయత ఉట్టిపడేలా చీరలో వచ్చిన ఆమె, నుదుటిన సిందూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు.అంతేకాకుండా కొన్ని నెలలుగా వస్తోన్న తన విడాకుల రూమర్స్?కు కూడా తనదైన స్టైల్?లో చెక్? పెట్టారు.కొంతకాలంగా తన శరీరాకృతి, బరువు పెరుగుదలపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలు, ట్రోల్స్‌పై ఐశ్వర్య తాజాగా గట్టిగా స్పందించారు.ప్రస్తుతంఆరాధ్య జన్మించిన తర్వాత ఐశ్వర్య రాయ్ బరువు పెరిగారంటూ గతంలో పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం తెలిసిందే. పలు సందర్భాల్లో ఆమె బాడీ షేమింగ్ కు కూడా గురయ్యారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న ఐశ్వర్య, ఇప్పుడు ఆ విమర్శలకు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. "నేను బరువు పెరిగితే మీకొచ్చిన సమస్య ఏంటి? కూతురు పుట్టిన తర్వాత నేను బరువు పెరిగానా లేక ఒంటికి నీరు పట్టిందా అనే దానిపై మీకెందుకంత ఆసక్తి? అది నేను చూసుకుంటాను కదా," అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.తన బరువు తనకు ఎప్పుడూ సమస్య కాదని, ప్రస్తుతం తాను సంతోషంగా తన కుమార్తెను చూసుకుంటున్నానని ఐశ్వర్య స్పష్టం చేశారు. "నా బరువుతో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. కావాలంటే రాత్రికి రాత్రే బరువు తగ్గించుకోగలను. కానీ నాకు ఆ అవసరం ఇప్పుడు లేదు. ప్రస్తుతం నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఎవరు ఏమనుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది లేదు," అని ఆమె తేల్చి చెప్పారు బాడీ షేమింగ్ విమర్శలపై స్పందించిన ఐశ్వర్యరాయ్%ూఅంష్త్రఖ్యుతీఖ్మి ఘఱ%: బాడీ షేమింగ్ విమర్శలపై స్పందించిన ఐశ్వర్యరాయ్ కొందరు ఇదిలా ఉండగా, కేన్స్ ఫెస్టివల్‌లో ఐశ్వర్య సిందూరంతో కనిపించడంపై సోషల్ మీడియాలో భిన్నమైన చర్చ జరుగుతోంది.భర్తపై ఉన్న ప్రేమతోనే అలా వచ్చిందని, తమపై వచ్చే రూమర్స్‌కి ఇలా చెక్ పెట్టిందని కొందరు అంటున్నారు.'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ఆమె అలా సిందూరం పెట్టుకున్నారంటూ కొందరు పోస్టులు పెడుతున్నారు.

# మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య దర్శకుడికి ఖరీదైన బహుమతి



మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య దర్శకుడికి ఖరీదైన బహుమతిని అందజేశారు. చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో వచ్చిన చిత్రం వాల్తేరు వీరయ్య. ఈ సినిమా 2023లో విడుదలై బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత చాలారోజులకు బాబీని ఇంటికి పిలిపించుకోని చిరు వాచ్‌ని గిఫ్ట్‌గా ఇచ్చాడు.ఒమేగా సీమాస్టర్ డైవర్ 300 వాచ్‌ను బాబీ కొల్లికి బహుమతిగా ఇచ్చారు. ఈ వాచ్ విలువ సుమారు రూ. 4.88 లక్షలు ఉంటుందని అంచనా. వాచ్ ఇచ్చిన అనంతరం బాబీ కొల్లి తన సంతోషాన్ని సోషల్ మీడియాలో వ్యక్తం చేశారు. చిరంజీవి తనకు ఇచ్చిన ప్రోత్సాహానికి, ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మూమెంట్ ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.

# ప్రభాస్ తో నటించనున్న రుక్మిణి వసంత్?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజీ' చిత్రాలతో బిజీగా ఉన్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ త్వరలోనే సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' యూనిట్‌లో జాయిన్ కానున్నాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న సందీప్ వంగా నటీనటుల సెలక్షన్లో బిజీగా ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ సరసన నటించే హీరోయిన్ కోసం వెతుకుతున్నాడు. పాన్ ఇండియా చిత్రం కావడంతో ఇందులో దీపికా పదుకొణేని తీసుకోవాలని అనుకున్నాడట సందీప్ వంగా 'కల్కి' మూవీలో వీరిద్దరు కలిసి నటించడం, దీపికాకు నేషనల్ వైడ్ క్రేజ్ ఉండటంతో అమె అయితేనే బాగుంటుందని అనుకున్నాడట. అయితే దీపిక ఏకంగా రూ.40 కోట్ల రెమ్యునరేషన్ అడగటంతో నిర్మాతలకు కళ్లు బైర్లు కమ్మాయట. వారు రూ.20 కోట్లు ఇవ్వడానికి సిద్ధపడినా ఆమె ఒప్పుకోలేదట. దీంతో వంగా ఆమెని ప్రాజెక్టు నుంచి తప్పించినట్లు వార్తలొచ్చాయి. అయితే రెమ్యునరేషన్ విషయంలో తేడాలు రావడంతో ఈ ప్రాజెక్టు నుంచి బాలీవుడ్ నటులు తప్పుకోవడం ఇదే తొలిసారి కాదు. గతంలో సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ కూడా పారితోషికం విషయంలో విబేధాలు రావడంతో తప్పుకున్నారని ప్రచారం జరిగింది.హీరోయిన్‌జిఈ క్రమంలోనే హీరోయిన్‌గా దీపికా పదుకొణె ప్లేస్‌లో రుక్మిణి వసంత్‌ని తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నారట. ఇప్పటికే ఆమెతో చర్చలు జరిగాయని అధికారిక ప్రకటన త్వరలో రానుందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ వార్త ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది. రుక్మిణి వసంత్ 2019లో 'బీర్బల్ ట్రిలాజీ' అనే కన్నడ సినిమాతో నటిగా పరిచయమయ్యారు. 2023లో విడుదలైన 'సప్త సాగరదాచే ఎల్లో' చిత్రాల్లో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలతో పాటు, ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డు కూడా లభించింది. తెలుగులో కూడా నిఖిల్ సిద్ధార్థ హీరోగా నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే సినిమాతో రుక్మిణి ప్రేక్షకులకు పరిచయమైనప్పటికీ, ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో తెరకెక్కుతోన్న చిత్రంలో (టైటిల్ 'డ్రాగన్' అని ప్రచారంలో ఉంది) నటిస్తోంది. అంతేకాకుండా మరిన్ని తెలుగు చిత్రాల్లో ఆమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ సరసన 'స్పిరిట్'లో ఆమెకు అవకాశం రానున్నట్లు వార్తలొస్తున్నాయి ఇదే గనుక జరిగితే ఆమె త్వరలోనే టాలీవుడ్లో టాప్ హీరోయిన్‌గా అవతరించడం ఖాయంగా కనిపిస్తోంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339